సైకిల్ యాత్రను జయప్రదం చేయండి



నవతెలంగాణ-చేర్యాల: విద్యా రంగ సమస్యలు, సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరిగే సమర భేరి సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి సుద్దాల భాస్కర్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సమావేశం సోమవారం మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు ఆముదాల రంజిత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య, సంక్షేమమే తమ ధ్యేయంగా ప్రకటించిందని, అధికారం చేపట్టి నేటికి 9 సంవత్సరాలు పూర్తి అవుతున్నా ఈ జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి ఉన్నా సంక్షేమ హాస్టల్స్ విద్యార్థుల సమస్యలను పరిష్కారం చేసిన పరిస్థితి లేదన్నారు. రోజురోజుకు నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పేద విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం లేదన్నారు. నేడు జిల్లాలో ఉన్న హాస్టల్స్ సమస్యలకు నిలయాలు గా మారాయన్నారు. శాస్త్రీయ విద్యకై, విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకై జరిగే సమర భేరి 'సైకిల్ యాత్ర' ను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో డివిజన్ నాయకులు నరేష్, మధు, రాకేష్, సంజు, హర్షవర్ధన్, రంజిత్, సాయి వర్ధన్ పాల్గొన్నారు.

మెదక్ సంగారెడ్డి సిద్దిపేట



నవతెలంగాణ 1

మంగళవారం 18 జూలై 2023

విద్యారంగంలో సమస్యల తిష్ట

- ప్రభుత్వ విద్యా సంస్థల సమస్యలు పరిష్కరించాలి
- అధ్యయనం.. పోరాటం ఎస్ఎఫ్ఐ పంతం
- నేడు చేర్యాల నుండి ప్రారంభం.. 26న సిద్దిపేటలో ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర ముగింపు





నవ తెలంగాణ - సిద్దిపేట

ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల క్రితం ప్రకటించిన కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధి, సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసున్నది. ప్రభుత్వ విద్యా సంస్థలను కాపాడుకోవాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమర భేరి సైకిల్ యాత్రను చేపట్టనున్నారు. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తవుతున్నా సీఎం కేసీఆర్ విద్యా రంగ సమస్యలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రోజురోజుకు నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచడం లేదు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస వసతులు లేవు. కొత్తగా ప్రారంభించిన గురుకులాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. అద్దె భవనాలలో అరకొర వసతులతో నడుస్తున్నాయి. కాలేజీ హాస్టల్స్‌కు సొంత భవనాలు లేవు. లెక్చరర్స్, ఉపాధ్యాయులు, వార్డెన్స్ లేక, వందల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వ విద్యా సంస్థలు బలోపేతం అవడం లేదు. అనేక గురుకులాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. కేజీబీవీ కాలేజ్ హాస్టల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్స్‌లో సుమారు లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లకు దొడ్డు బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రతి హాస్టల్లో నెలకు రెండుసార్లు వైద్య పరీక్షలను చేయాలని జీఓలున్నా ఎక్కడా అమలు కావడం లేదు. మెడికల్ కిట్లు సరఫరా చేయడం లేదు. నోట్‌బుక్స్, పెట్టెలు, ప్లేట్స్, దప్పట్లు, దుస్తువులు సరైన సమయానికి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు పాఠశాలల్లో, హాస్టల్లో మంచి నీళ్లు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, గదులు, ఆట స్థలం, ల్యాబ్, ఫరిచర్స్ సరిగా లేవు. మన ఊరు మనబడి, మన బస్తీ మనబడి కింద కొన్ని పాఠశాలలు ఎంపిక కాగా, వాటిలో సంవత్సరం నడుస్తున్నా నేటికీ పనులు పూర్తి కాకపోవడం విద్యపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ కనబడుతున్నది. ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌లు అనేకం పెండింగ్లో ఉండడంతో విద్యాసంస్థలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధ్యయనం, పోరాటం, చదువుతూ పోరాడు, చదవు కోసం పోరాడు అనే నినాదంతో శాస్త్రీయ విద్య కోసం విద్యారంగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర చేపట్టనుంది.

డిమాండ్స్

- సిద్దిపేటలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి
- సిద్దిపేట జిల్లా కేంద్రంలో లా కాలేజీ ఏర్పాటు చేయాలి
- సిద్దిపేట జిల్లా కేంద్రంలో గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజిని ఏర్పాటు చేయాలి
- చేర్యాల, దుబ్బాకలో ఉమెన్స్ డిగ్రీ కాలేజిని ఏర్పాటు చేయాలి
- పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు రూ.3500 ఇవ్వాలి. కాస్మోటిక్ చార్జీలతో పాటు రూ.500 కిట్టు తక్షణమే ఇవ్వాలి
- జిల్లాలో ఖాళీగా ఉన్న లెక్చరర్స్, ఉపాధ్యాయ, వార్డెన్, వర్కర్స్ పోస్టులను భర్తీ చేయాలి
- అద్దె భవనాలలో నడుస్తున్న గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలి
- విద్యార్థులకు సరిపోయే మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానపు గదులను నిర్మించాలి
- హాస్టల్ విద్యార్థులందరికీ ప్రతి నెల మెడికల్ చెకప్ చేయించాలి
- ప్రతి సంవత్సరం విద్యార్థులకు 4 జతల బట్టలు, బ్లాంకెట్స్ సరఫరా చేయాలి
- మెనూ ప్రకారం భోజనం పెట్టాలి. వార్డెన్స్ పై అధికారులు చర్యలు తీసుకోవాలి
- విద్యార్థినుల హాస్టల్స్‌కు రక్షణ కల్పించాలి. వేధించిన వారిపై క్రిమినల్ కేసులను నామోదు చేయాలి
- సంక్షేమ హాస్టళ్లకు బడ్జెట్ లో అధిక నిధులను కేటాయించాలి
- పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి
- ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లీష్ మీడియం కేజి క్లాసులు ప్రారంభించాలి
- విద్యారంగానికి బడ్జెట్ లో రాష్ట్రానికి 30 శాతం నిధులు కేటాయించాలి
- కేజీబీవీ లో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో తొలగించిన స్కావెంజర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి
- మన ఊరు-మన బడి, మన బస్తి- మనబడి ఇది అన్ని పాఠశాలలకు విస్తరించాలి. ఈపథకం అమలు కోసం నిధులు పెంచాలి
- ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజిని ఏర్పాటు చేయాలి
- ప్రతి మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్ కు స్పేషల్ ఆఫీసర్ ను కేటాయించాలి
- ప్రభుత్వ జూనియర్ కాలేజీలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి
- జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

సైకిల్ యాత్ర రూట్ మ్యాప్

- 18న చేర్యాల ప్రారంభం, మద్దూర్, దూల్ మిట్ట, సంగునూర్
- 19న సంగునూర్ నుండి అక్కన్నపేట, హుస్నాబాద్
- 20న హుస్నాబాద్ నుండి కోహెడ, బెజ్జంకి
- 21న బెజ్జంకి నుండి చిన్నకోడూర్, నారాయణరావుపేట, చింతమడక, దుబ్బాక
- 22న దుబ్బాక నుండి మిరుదొడ్డి, అల్వాల, తొగుట, దౌల్తాబాద్
- 23న దౌల్తాబాద్ నుండి రాయపోల్, గజ్వేల్
- 24న గజ్వేల్ నుండి వర్గల్, ములుగు, జగదేవపూర్, తీగుల్
- 25న తీగుల్ నుండి కొమురవెల్లి, కొండపాక, తడ్కపల్లి, సిద్దిపేట
- 26 రోజున సిద్దిపేట ముగింపు బహిరంగ సభ

ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి



పేద, బడుగు, బలహీన వర్గాలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్‌కు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. విద్యా రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగులను వెంటనే నియమించాలి. హాస్టల్లో ఉండే విద్యార్థినులకు రక్షణ కల్పించాలి. నాణ్యమైన సన్నబియ్యం అందించాలి. మెస్ ఛార్జీలు పెంచాలి. క్రమంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి. హాస్టళ్లకు, పాఠశాలలకు, కళాశాల కోసం తప్పకుండా పక్కా భవనం నిర్మించాలి. సిద్దిపేటలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. లా కళాశాలను ఏర్పాటు చేయాలి. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న సైకిల్ యాత్రను విద్యార్థులు జయప్రదం చేయాలి.

- దాసరి ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

తొలగించిన రైతుల పేర్లను ధరణిలో ఎక్కించాలి

- సాగు చేసుకుంటున్న భూములకు కొత్త పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలి
- రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు



నవతెలంగాణ-కొండాపూర్

ధరణిలో తొలగించిన రైతు ల పేర్లను వెంటనే నమోదు చే యాలని, సాగు చేసుకుంటున్న భూములకు కొత్త పట్టా పాస్ పుస్తకా లను ఇవ్వాలని తెలంగా ణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండాపూర్ మండలంలోని మందపూర్ గ్రామంలో సోమవారం రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహందాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 22లో ఉన్న భూములను గతంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఎకరం, అర ఎకరం చొప్పున పేదలకు పంపిణీ పంపిణీ చేసిందన్నారు. అప్పటినుండి ఆ భూమిలో పంటలు వేస్తూ పేద రైతులు జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూప్రక్షాళన పేరుతో ధరణిలో ఆ పేద రైతుల పేర్లను నిలిపివేశారన్నారు. దీంతో కొత్త పాస్‌బుక్‌లు రాక పోవడంతో, ధరణిలో పేరు లేకపోవడంతో రైతుబంధు, రైతుబీమా ఇతర ప్రభుత్వ పథకాలకు వారు అనర్హులుగా అవుతున్నారన్నారు. అకాల మరణంతో చనిపోయిన రైతులకు రైతుబీమా కూడా రావట్లేదన్నారు. దీంతో ఆ పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కాబట్టి రెవెన్యూ యంత్రాంగం వెంటనే స్పందించి.. సాగులో ఉన్న రైతులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసి న్యాయం చేయాలన్నారు. వారు పట్టా పాస్ పుస్తకాలు సాధించే వరకు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కే. రాజయ్య, నాయకులు సందీప్, రైతులు రాములు, అంజయ్య, కమలమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు

టైర్ పగిలి.. బోల్తా కొట్టిన ట్రాలీ

- ఇద్దరు మతి
- ఇద్దరికి గాయాలు
- ఓఆర్ఆర్‌పై ఘటన



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఓఆర్ఆర్‌పై గ్రానైట్ లోడ్ తో వెళ్తున్న ఓ అశోక్ లేలాండ్ ట్రాలీ టైరు అకస్మాత్తుగా పగిలి పోవడంతో ట్రాలీ పల్టీలు కొట్టింది. ప్రమాద సమయంలో ట్రాలీలో ఐదుగురు ఉండగా.. ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన దినసరి కూలీలు వట్టి నాగులపల్లిలోని అనిల్ గ్రానైట్ షాపు నుంచి అశోక్ లేలాండ్ ట్రాలీ బండిలో గ్రానైట్‌ను లోడ్ చేసుకొని ఓఆర్ఆర్ మీదుగా బొల్లారం వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని పోచారం శివారులో గల ఓఆర్ఆర్‌పై ట్రాలీ బండి వెనుక టైరు పగిలి పల్టీ కొట్టింది. దీంతో బండిలో ఉన్న ఐదుగురిలో అనిల్ సదా (30) అక్కడికక్కడే మతి చెందాడు. ధర్మేందర్ (35) పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మతి చెందాడు. మరో ఇద్దరికి బలమైన గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ ప్రసాద్ రావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జేఈఈలో ఉత్తీర్ణత సాధించిన మానసకు సన్మానం



నవ తెలంగాణ- దుబ్బాక

దుబ్బాక మండల పరిధిలోని అచ్చుమాయిపల్లి గ్రామానికి చెందిన చింతల లక్ష్మి రాజు పెద్ద కుమార్తె మానస కాన్పూర్‌లోని ఐఐటీలో సీటు సాధించింది. జేఈఈ అడ్వాన్స్ డ్-2023 ఫలితాల్లో ఉత్తీర్ణత పొంది కాన్పూర్‌లోని ఐఐటీలో సీటు సాధించిన మానసను దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మానసకు బహుమతిగా ల్యాప్‌టాప్ అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సోమవారం చేగుంటలో మానసకు శాలువా కప్పి సన్మానించారు. మానసకు అన్ని విధాల తాను అండగా ఉంటానని, మరింత చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బీజేపీ మెదక్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ చింత సంతోష్ కుమార్, సీనియర్ నాయకులు అనిల్ రెడ్డి ఉన్నారు.

దళితబంధులో ఉప కులాలకు తీవ్ర అన్యాయం



నవ తెలంగాణ - సిద్దిపేట

ఎస్సీ 57 ఉప కులాలకు దళిత బంధు అమలు చేయాలని, దళిత బంధు పథకంలో ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఉప కులాల జిల్లా అధ్యక్షులు పిన్నింటి దాసు చిందు అన్నారు. జిల్లాలో దళిత బంధు అమలులో దళితులలోని రెండు కులాలకు తప్ప, మిగతా ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుల అభివృద్ధి కోసం దళిత బంధు ప్రవేశపెట్టామని చెబుతున్న ప్రభుత్వం, దళితులలో అట్టడుగు వర్గాలైన ఎస్సీ ఉపకులాలకు అందకపోవడం అన్యాయమన్నారు. దళిత బంధు అంటే రెండు కులాలు అన్నట్టు ఉందని, ఇకనుంచైనా ఉపకులాలను గుర్తించి న్యాయం చేయాలని అన్నారు. బుడాల సత్యరాజ్, పిల్లిట్లభుజంగం, చిందు పిల్లిట్ల విదుమౌళి, పిల్లిట్ల కనకయ్య, కిష్టయ్య, శివలింగం పాల్గొన్నారు.

సఫాయి కార్మికుడి అవతారమెత్తిన సర్పంచ్



నవ తెలంగాణ-దౌల్తాబాద్

గ్రామ పంచాయతీలో పని చేసే సఫాయి కార్మికులు నిరవధిక సమ్మెలో పాల్గొనడంతో మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో వీధుల్లో చెత్త పేరుకుపోయింది. సోమవారం సర్పంచ్ ముత్యంగారి యాదగిరి కార్మికుడిగా మారి చెత్తా చెదారాన్ని తొలగించారు. సర్పంచ్ ట్రాక్టర్ నడిపారు. ఉప సర్పంచ్ వీధుల్లోని చెత్తను ట్రాక్టర్‌లో వేశారు. ప్రజలు చెత్తా చెదారాన్ని రోడ్లపై వేయకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. సర్పంచ్, ఉప సర్పంచ్ సఫాయి కార్మికులుగా మారడంతో ప్రశంసించారు.

పిల్లలు పుట్టలేదని భార్యాభర్తల ఆత్మహత్య

- గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు



నవ తెలంగాణ నర్సాపూర్

పిల్లలు పుట్టలేదని మనస్థాపంతో భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నర్సాపూర్ మండల పరిధిలోని అహ్మద్ నగర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబీకుల కథనం ప్రకారం... అహ్మద్నగర్ గ్రామానికి చెందిన నీరుడి లక్ష్మణ్(38) అతని భార్య రాణి(34) ఏడు సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్నారు. నేటికీ పిల్లలు కలగలేదు. దీంతో మనస్తాపంతో జీవితంపై విరక్తి చెందిన భార్యాభర్తలు ఆదివారం రాత్రి ఇంట్లో గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో భార్యాభర్తలను గచ్చిబౌలిలోని ఏఐజి ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి భార్య రాణి, సోమవారం ఉదయం లక్ష్మణ్ మృతి చెందారు. భార్యాభర్తలు ఒకేసారి మృతి చెందడంతో అహమ్మద్ నగర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో శవాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి













సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణ-చేర్యాల

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేర్యాల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం 12వ రోజుకు చేరుకుంది. సమ్మెకు మల్లారెడ్డి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. కార్మికులకు నష్టం చేసే విధంగా జీవో 51ని తీసుకువచ్చి మల్టీ పర్పస్ విధానాన్ని అమలు చేస్తుందని, దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన కారోబార్లను జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గా పదోన్నతి కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మికుడు చనిపోతే ఎక్స్ గ్రేస్ కింద పది లక్షల రూపాయలు ఇవ్వాలని కోరారు. డిమాండ్ల పరిష్కారం కోసం చట్టబద్ధమైన సమ్మె చేస్తున్న కార్మికులను బెదిరింపులకు గురి చేస్తున్న అధికారుల తీరు సరి కాదన్నారు. వేతనాలు, పీఆర్సీల కోసం కొట్లాడినప్పుడు ఇది గుర్తుకు రాలేదా అన్నారు. న్యాయబద్ధంగా సమ్మె చేస్తున్న కార్మికులను ఇబ్బం దులకు గురి చేయడం సరైన పద్ధతి కాదని, కార్మికులు చేస్తున్న సమ్మెకు అందరూ సహకరించాలని కోరారు. సిఐటి యు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, మండల కన్వీనర్ రేపాక కుమార్, పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పంతం రాజు, కరుణాకర్, భిక్షపతి, మనోజ్, సాయిబాబా, మల్లమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట: పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించాలని పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు మస్కురి శంకర్ అన్నారు. సోమవారం నాటికి జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె 12వ రోజుకు చేరుకుంది. గ్రామాలలో పనిచే స్తున్న మాకు ఒక్కరి వేతనంలో ఇద్దరు తీసుకోవాలని కొర్రీలు పెడ్తుతున్నారని ఆరోపించారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పిట్ల రాములు, రాజు, నాగరాజు, కృష్ణ, నారాయణ, లక్ష్మీ ఉన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి : తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె కాలంలో ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు పారిశుధ్య కార్మికులుగా అవతార మెత్తి గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెను నీరుగార్చకుండా అండగా నిలవాలని పంచాయతీ కార్మికులు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ వద్ద చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె 12వ రోజు కొనసాగింది. నిరవధిక సమ్మె శిబిరం నుండి కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి డప్పు చప్పుల్లతో మండల కేంద్రంలోని వాణిజ్య దుకాణాల వద్ద భిక్షాటన చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేశారు.

నవ తెలంగాణ -దుబ్బాక: గ్రామపంచాయతీ కార్మికులు తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన సోమవారంతో 12 రోజులకు చేరింది. పంచాయతీ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని చేస్తున్న సమ్మెకు సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికుల సమ్మెతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ లేక ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వీరి న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. మరో మూడు రోజుల్లో కరెంటు, మంచినీటి సరఫరాను ఆపుతామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు కొంపల్లి భాస్కర్, నాగరాజు, దేవయ్య, పంచాయతీ కార్మికులు ప్రశాంత్, రవి, దుర్గయ్య, పెంటయ్య, రాములు, పోచయ్య లక్ష్మి, నర్సవ్వ, ఎల్లవ్వ, దుర్గవ్వ పాల్గొన్నారు.

నవతెలంగాణ వర్గల్: జీపీ కార్మికుల సమ్మె సోమవారం నాటికి 12వ రోజుకు చేరుకున్నది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె విరమించబోమని కార్మికులు అన్నారు. ఈ సమ్మెలో సీఐటీయూ మండల అధ్యక్షుడు మర్రికింది నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎల్లం, కోశాధికారి నారాయణ, సిఐటియు నాయకురాలు బాలమ్మ, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ - సిద్దిపేట: గత 12 రోజుగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి, నాయిని నరసింహారెడ్డి, కళిమొద్దీన్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. క్యాంప్ ఆఫీస్ పక్కనే గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా మంత్రి హరీశ్‌రావుకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమ్మె చేస్తున్న జీపీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ పక్షాన మద్దతు తెలిపారు. కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం వాటిని పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమస్యగా తీసుకొని ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షులు కొలిమి బిక్షపతి, సిద్దిపేట రూరల్ అధ్యక్షులు గరిపల్లి రాములు, నారాయణపేట మండల అధ్యక్షులు బర్మా రామ చంద్రం తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన



నవతెలంగాణ-సంగారెడ్డి

వివిధ మేనేజ్మెంట్లలో పనిచేస్తున్న గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞాన మంజరి మాట్లాడుతూ.. 6 మేనేజ్మెంట్లలో ఉన్న గురుకుల టీచర్ల బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలన్నారు. ఒకే రకమైన పరిపాలన విధానం ఉండాలని, హెల్త్ కార్డులు, ఫీజు రియంబర్స్మెంట్ వర్తింపజేయాలన్నారు. పారిటి స్కేల్స్ ఇవ్వాలని, కేర్ టేకర్, డిప్యూటీ వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పని భారం తగ్గించి, అధికారుల వేధింపులు ఆపాలని కోరారు. నెల మొదటి తేదీన జీతాలు ఇవ్వాలని, పీవో 2018 కు సంబంధించి కోర్టు వివాదాలను సత్వరమే పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు, గెస్ట్, పార్ట్ టైం, ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులకు బేసిక్ పే, 12 నెలల వేతనం ఇవ్వాలన్నారు. ఆర్ట్, క్రాఫ్ట్ డ్రాయింగ్ టీచర్లకు, స్టాఫ్ నర్స్‌లకు ప్రమోషన్ ఛానల్ కల్పించాలన్నారు. అన్ని సొసైటీల్లో ప్రిన్సిపాల్ 100శాతం, జేఎల్, పిజిటి పోస్టుల్లో 70శాతం ఇన్ సర్వీస్ పదోన్నతుల కోటగా నిర్ణయించాలన్నారు. వాటితోపాటు తదితర డిమాండ్స్‌ను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 5న చలో హైదరాబాద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. గురుకుల ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా వారు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.అశోక్, బి.సాయిలు, జిల్లా కార్యదర్శులు బి. సాయితేజ, బి. అరుణశ్రీ, సిహెచ్. కష్టం రాజు, వి.అనురాధ నాయకులు ఆర్ .సింహాచలం, ఎం. విజనంద్, ఏ.వెంకయ్య, బి. కిష్టయ్య, జి. కష్ణ, లక్ష్మయ్య, కష్ణమూర్తి, జి. ప్రభాకర్, అశోక్, గురుల్ల్ టీచర్లు మోసిన్, రామన్న, శ్రీనివాస చారి, విటమ్మ, బి. శ్రీనివాసులు, ప్రశాంత్ గౌడ్, పరశురాములు, బసవరాజు, కవిత, మోహన్, కష్ణ, అర్చన, మల్లికార్జున్, ప్రవీణ్ పాల్గొన్నారు.



నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్: గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రమోషన్ కల్పించాలని, బదిలీల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేసింది. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా అధ్యక్షులు షేక్ వలిహమ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి తొప్పెట్ల యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం గురుకుల విద్యకు ప్రాధాన్యత ఇస్తూ అధిక సంఖ్యలో సంక్షేమ గురుకుల విద్యా సంస్థలను ఏర్పాటు చేసిందన్నారు. ఆరేళ్లు గడిచినా స్వంత భవనాలు నిర్మించలేదన్నారు. ఉపాధ్యాయులను తగినంత మందిని నియమించలేదన్నారు. ఉన్న ఉపాధ్యాయులపై భారం పడుతున్నదన్నారు. బోధనేతర పనులతో మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఐదేళ్లుగా గురుకుల ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించలేదన్నారు. సమస్యలన్నిటినీ పరిష్కరించకపోతే ఆగస్టు 5వ తేదీన పెద్ద ఎత్తున ఇందిరా పార్కు వద్ద గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. శిబిరంలో టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి టి యాదగిరి ,కోశాధికారి ఎం కృష్ణ జిల్లా కార్యదర్శులు కె.కనకరాజు ,డి.గిరిబాబు,టీ. శివలింగం, జిల్లా కమిటీ సభ్యులు ఎస్. వెంకటేశం, సీహెచ్, కృష్ణ,ఎన్ నిరంజన్,జె. నర్సింలు, ఈ. రాజు, గురుకుల పాఠశాలల కన్వీనర్ వీ. కృష్ణ, వెంకటలక్ష్మిసరిత, రామ్మోహన్, చంద్రకాంత్, రాజిరెడ్డి, సుమన్ రమేష్, రాకేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్



నవతెలంగాణ-చేర్యాల

అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ల బండి శశిధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేర్యాల మండల కేంద్రంలోని వ్యకాస కార్యాలయంలో సోమవారం వ్యకాస మండల కమిటీ సమావేశం మల్యాని ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శశిధర్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో పేదలకు స్వంత ఇండ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం ప్రవేశ పెడతానాన్న గృహలక్ష్మి పథకం ద్వారా డబుల్ బెడ్ రూమ్, ఇంటి నిర్మాణం కోసం ప్రతి లబ్ధిదారునికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు అనేక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతూ అందని ద్రాక్షలా ఏ ఒక్క పథకాన్ని సమర్ధవంతంగా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందించడం లేదని విమర్శించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజలను, ప్రజల అవసరాలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల దృష్టిని మరల్చి వేస్తుందని, ఇది ఎంతకాలం సాగదని, ప్రజల అవసరాలను గుర్తించకుండా, ఏళ్ల తరబడి ఇబ్బందులు గురి చేస్తుందన్నారు. ప్రకటించిన పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వ విధానాలపై వ్యవసాయ కార్మికులను ఏకం చేసి పోరా టాలతో గృహలక్ష్మి పథకాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో, మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్, కమిటీ సభ్యులు జిడాల చంద్రయ్య, మర్యాల సత్తయ్య పొన్నమైన సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా సీఎం సహాయనిధి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ఆపత్కాల సమయంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనికి చెందిన రంగయ్య శెట్టి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ద్వారా సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు మంజూరైన రూ.90 వేల ఎల్ఓసిని సోమవారం రంగయ్య శెట్టి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పాండు, నాయకులు దశరథ్ రెడ్డి,వెంకట్ రెడ్డి,నాగేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని మేళాసంఘం గ్రామానికి చెందిన పలువురు సోమవారం అందోల్ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరినట్టు పార్టీ మునిపల్లి మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్ తెలిపారు. కాగా మండలంలో బీఆర్ఎస్ దూకుడు మీద ఉన్నదని.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై అనేకమంది పార్టీలో చేరుతున్నట్టు శశికుమార్ వివరించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. ఏ పార్టీలో లేని ప్రాధాన్యత, గౌరవం ఈ పార్టీలో దక్కుతుందన్నారు. గతంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని గ్రామాలు.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దినదినాభివృద్ధి చెందుతున్నాయన్నారు. నూతనంగా పార్టీలో చేరుతున్న వారికి శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీలోకి ఆహ్వానించించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుతుబుద్దీన్ సలావుద్దీన్ మల్లేపల్లి యాదన్న, సంతోష్ కుమార్, పలువురు పాల్గొన్నారు.

'పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర'ను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సదాశివపేట

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థిత ప్రజ్ఞ చేపట్టిన 'పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర' ఈనెల 29న సంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశిస్తున్నదని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలా శ్రీనివాస్ తెలిపారు. సదాశివపేట పట్టణంలోని ఉజ్వల జూనియర్ కళాశాలలో సోమవారం చేపట్టిన టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 29న ఉదయం 9 గంటలకు సంగారెడ్డిలోని పీఎస్ఆర్ గార్డెన్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై టీఎన్జీఓ భవన్ వరకు సాగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు టీఎన్జీఓ భవన్‌లో సభ ఉంటుందన్నారు. ఈ సభకు సంగారెడ్డి జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షులు రామచందర్, ప్రధాన కార్యదర్శి వరప్రసాద్,రాష్ట్ర నాయకులు అంజన్న, కోశాధికారి జొన్నాడ మల్లేశం, జిల్లా నాయకులు భాస్కర్, రామకృష్ణ,గోపాల్, సాయి చారి, ఫారుక్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


సీఐ, ఎస్సైని సన్మానించిన శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-కంగ్టి

నూతన సీఐ జక్కుల హన్మంతు, ఎస్సై సత్యనారాయణలను సోమవారం విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ ట్రస్ట్ చైర్మెన్, బీఆర్ఎస్ నాయకులు విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు.కార్యక్రమంలో అంజాగౌడ్, చంద్రకాంత్, సంజు, జలీల్, కృష్ణమూర్తి, మున్వర్ ఖురేషి, శంకర్ గౌడ్, నాగరాజు, సిద్దు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఆత్మకూర్ నాగేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆత్మకూరు నాగేష్ కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆ వెంకటేశ్వర స్వామిని కోరుకున్నట్టు చెప్పారు. అంతేకాకుండా ఈ యేడు వర్షాలు పుష్కలంగా పడి.. రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-మనూర్

మండల పరిధిలోని రాయిపల్లీ గ్రామానికి చెందిన హైమద్ హుస్సెన్‌కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును డీసీసీ ప్రధానకార్యదర్శి పి.చంద్రశేఖర్ రెడ్డి సోమవారం అందజేశారు. కాగా బాధిత కుటుంబానికి ఈ చెక్కు మంజూరవడంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎంతో కృషి చేశార న్నారు. పేదలకు అండగా నిలుస్తున్న జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంచందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైని సన్మానించిన శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-మనూర్

నాగల్‌గిద్ద నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన విద్యా చరణ్ రెడ్డిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, విగ్రం రామా గౌడ్ ట్రస్ట్ చైర్మెన్ శ్రీనివాస్ గౌడ్ సోమవారం ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. విగ్రం రామా గౌడ్ సోషల్ వేల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈనెలలోనే నాగిల్‌గిద్దలో కూడా ఏర్పాటు చేస్తామని.. అందుకు హాజరు కావాలని ఎస్సైని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జోగుపేట ముత్యాలమ్మ దేవాలయ వార్షికోత్సవం



నవతెలంగాణ-జోగిపేట

శ్రావణమాసాన్ని పురస్కరించుకొని జోగిపేట పట్టణంలోని శ్రీ ముత్యాలమ్మ దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగభూషణం, కౌన్సిలర్ సురేష్, ప్రముఖ వ్యాపారులు చింతల సురేష్, ప్రవీణ్, బ్రహ్మయ్య, లక్ష్మణ్, మురళి, ప్రవీణ్, ప్రభు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వట్‌పల్లి లయన్స్ క్లబ్ చైర్మెన్‌గా విద్యాసాగర్



నవతెలంగాణ-వట్‌పల్లి

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ చీఫ్ గెస్ట్ ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన వట్‌పల్లి లయన్స్ క్లబ్ నూతన కమిటీని నియమించారు. చైర్మెన్‌గా విద్యాసాగర్ రావు, వైస్ ప్రెసిడెంట్ మోహిన్‌గా, సెక్రెటరీగా కిషన్, ట్రెజరంగా చంద్రశేఖర్‌లతో నూతన కమిటీ ఏర్పడింది. ఈ కార్యక్రమంలో డిస్టిక్ జాయింట్ క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ అనంతరెడ్డి, రీజియన్ చైర్మెన్ శంకర్, రీజియన్ సెక్రెటరీ దిగంబర్‌రావు, జోన్ చైర్మెన్ పెద్దన్న, జోగిపేట లయన్స్ క్లబ్, నారాయణ ఖేడ్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి బోనాల పండుగ



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని బొంతపల్లి, దోమడుగు తదితర గ్రామాలలో ఆషాడ మాసం పురస్కరించుకొని ఆయా గ్రామాల పాలకవర్గం ఆధ్వర్యంలో దుర్గమ్మ, పోచమ్మ ఆలయాల్లో బండ్లు, బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సురభి నాగేందర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, బాలుగౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని యువతీ, యువకులు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకుని.. సద్వినియోగం చేసుకోవాలని పార్టీ పట్టణ యువత అధ్యక్షులు బిట్ల ప్రేమ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్ సహకారంతో ఆయన క్యాంపు కార్యాలయంలో ఈనెల 19నుంచి 29 వరకుఉచిత లైసెన్స్ పొందడానికి దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సి మెమో, పాన్‌కార్డు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఓటర్ ఐడి కార్డు తీసుకొని కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో యువత నాయకులు నాగులపల్లి కుమార్, వీరేశం,గడ్డే నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సుడిగుండంలో

మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల

- కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు





విద్యార్థులతో మాట్లాడటానికి కనీసం షెడ్డు కూడా లేని దుస్థితి..

నవతెలంగాణ-జహీరాబాద్

మండలంలోని బూచినెల్లూరు గ్రామ పరిధిలో గల అల్గోల్ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం అన్ని విధాలా కృషి చేస్తున్నామని చెబుతున్నప్పటికీ.. మౌలిక సదుపాయాల కల్పనలో కూడా పూర్తిగా విఫలమవుతున్నది. బూచినెల్లూరి మైనార్టీ పాఠశాలలో బోధన సిబ్బంది, పీఈటీ సిబ్బంది కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా తాగునీటి సమస్య విద్యార్థులకు పట్టిపీడిస్తున్నది. పాఠశాల భవనాన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించినప్పటికీ.. విద్యార్థినులను కలవడానికి వచ్చిన తల్లిదండ్రులు నిలబడేందుకు కనీసం షెడ్డు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో.. ఆ వర్షంలోనే విద్యార్థులతో మాట్లాడాల్సిన దుస్థితి నెలకొన్నదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గతంలో పాఠశాలలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు.. రెసిడెన్షియల్ పాఠశాలలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ నాటి నుండి నేటి వరకు ఏ విధమైన చర్యలు చేపట్టలేదు. దీంతో విద్యార్థులను కలిసేందుకు వెళ్లిన తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నది. ఇప్పటికైనా మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వాహకులు, పాలకులు, ప్రభుత్వ అధికారులు స్పందించి మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



హోం మంత్రిని కలిసిన మఠం బిక్షపతి

నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మెన్‌గా ఎన్నికైన సందర్భంగా మఠం బిక్షపతి సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో హోం మంత్రి మహమ్మద్ అలీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా ఈనెల 20వ తేదీన ప్రమాణస్వీకారణ మహోత్సవానికి ఆయన్ను ఆహ్వానించినట్టు బిక్షపతి చెప్పారు. ఆయన వెంట తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్ ఉన్నారు.

మంత్రిని కలిసిన ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్లు

- క్రమబద్ధీకరించాలని వినతి



నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి సుమారుగా 200 పైగా ల్యాబ్ టెక్నీషియన్లు సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కలిశారు. హైదరాబాదులోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కవ్వం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారుగా 572 మంది ల్యాబ్ టెక్నీషియన్లు 2 దశాబ్దాలుగా ఎన్‌హెచ్‌ఎం స్కీం కింద విధులు నిర్వహిస్తు న్నారన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రెగ్యులర్ ల్యాబ్ టెక్నీషియన్ మాదిరిగానే అని విధులు నిర్వ హిస్తున్నారని.. కరోనా, టీబీ లాంటి అంటువ్యాధులతో ప్రభు త్వం చేపట్టిన తెలంగాణ డయాగ్నస్టిక్స్‌లో వివిధ రకాల రోగనిర్ధాన పరీక్షల్లో ముందుండి పనిచేస్తున్నారన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత లేకుండా అహర్నిశలు కష్టపడు తున్నారన్నారు. వైద్యుల మాదిరిగానే తమకు ఎలాంటి రాత పరీక్ష లేకుండా వెయిటేజ్ ఇచ్చి క్రమబద్ధీకరించాలని, తమ కుటుంబాలకు ఆరోగ్య రక్షణ కల్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి.. డిమా oడ్లను పరిష్కరిస్తామని హామీ ఇచారన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్, కోశాధికారి తిరుమల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ స్వామి, సంయుక్త కార్యదర్శి ఒంటిరు లక్ష్మారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు, సంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ జి. ఆనంద్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. జేమ్స్, సభ్యులు దుర్గాప్రసాద్, రాధిక, రజనీ. సంగీత తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- టీఎస్‌హెచ్‌డీసీ చైర్మెన్ చింతా ప్రభాకర్



నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్రంలో గడపగడపకు బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మెన్ చింతా ప్రభాకర్ అన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా సంగారెడ్డి మండలంలోని కొత్లాపూర్ గ్రామానికి చెందిన 6 మంది లబ్దిదారులకు చింత ప్రభాకర్ చేతుల మీదుగా సోమవారం గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొర్ల కాపరులు ఆయన్ను శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. మూడు పంటలు ఇచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలా.. మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా? అని అన్నారు. దేశంలో ఎక్కడ కూడా తెలంగాణలో ఉన్న సంక్షేమ ఫలాలు లేవు అన్నారు. యాదవులకు ఎక్కడా లేని సంక్షేమం.. తెలంగాణలో సీఎం కేసిఆర్ సారథ్యంలో అమలవున్నదన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను.. ఇతర రాష్ట్ర ప్రజలు తమ రాష్ట్రంలో అమలు చేయాలని కోరుతున్నారన్నారు. దేశానికే ఆదర్శంగా తెలంగాణ ఎదుగుతుంటే.. ఓర్వలేక రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు రైతులు మరువలేదన్నారు. అలాగే మత విద్వేషాలు సృష్టించి ప్రజల మధ్య చిచ్చుపెట్టే పార్టీని దగ్గరికి కూడా రానివ్వదన్నారు. రానున్న ఎన్నికల్లో మూడోసారి సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మనోహర్ గౌడ్, సర్పంచ్ సందీప్, మండలాధ్యక్షులు చక్రపాణి, వివిధ గ్రామాల సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అందోల్-జోగిపేట మున్సిపాల్టీకి అదనంగా రూ.25 కోట్లు

- ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ చైర్మెన్, కౌన్సిలర్లు



నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్-జోగిపేట మున్సిపల్ అభివృద్ధికి అదనంగా మరో రూ.25 కోట్లు రానున్నాయని ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తెలిపారు. సోమవారం అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి పోతుల బోగోడ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆందోల్ జోగిపేట మున్సిపల్ అభివృద్ధిపై చర్చించారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ మున్సిపాల్టీలకు మంజూరు చేసిన రూ. 25 కోట్లకు సంబంధించిన పనులు జరుగుతున్నాయన్నారు. అదనంగా రానున్న నిధులతో ఏ పనులు చేద్దామని ఎమ్మెల్యే అడుగ్గా.. ఆయా వార్డుల్లో మిగిలిపోయిన సీసీరోడ్లు, డ్రయినేజీలు, ఇతర పనులు చేపట్టాలని చర్చించారు. అందోల్-జోగిపేటను అద్దంలా తయారు చేద్దామని మున్సిపల్ సభ్యులతో ఎమ్మెల్యే అన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండి వార్డుల అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. 12వ వార్డులోని కందకం మూసివేతకు పైపు లైన్లు, పురాతన బురుజు ఆధునికరణ, రాజరాజేశ్వరి టెంపుల్ అభివృద్ధికి సహకరించాలని ఆ వార్డు కౌన్సిలర్ నాగరాజు ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెట్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు దుర్గేష్, నాగరాజు, చందర్, కోఆప్షన్ సభ్యులు ఎండీ. పైజల్, బీఆర్ఎస్ నాయకులు సత్యం, లక్ష్మణ్, నాగరత్నం గౌడ్, రవీంద్ర గౌడ్, వెంకటేశం, సంతోష్, షకీల్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులకు ఇండ్లు, వసతులు కల్పించాలి

నవతెలంగాణ-గుమ్మడిదల

మండలం బొంతపల్లి పారిశ్రామికవాడలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులకు ఇండ్లు, సరైన వసతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.రాజయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీహార్, ఒడిశా మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వలస కార్మికులను తీసుకువచ్చి స్టీల్ పరిశ్రమలు, గ్రాన్యూల్స్, కెమికల్ రసాయన పరిశ్రమల్లో పనులు చేయిస్తున్నారన్నారు. అయితే అనివార్య కారణాలతో ఆ కార్మికులు మృతి చెందితే.. ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా లోలోపల గుట్టుచప్పుడు కాకుండా వారి రాష్ట్రానికి పంపిస్తున్నారని వాపోయారు. పరిశ్రమల్లో కార్మికులుగా పని చేయించుకుంటూ.. వారు ఉండడానికి సరైన ఇల్లు, నీళ్లు, బాత్రూంలు కూడా ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు.



పారిశ్రామికవేత్తలు వలస కార్మికుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారు ఉండడానికి సరైన వసతులు కల్పించాలని కోరారు. విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ వలస కార్మికులు తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి ఆరోపించారు. వెల్ఫేర్ బోర్డు నిధులను భవన నిర్మాణ కార్మికులకు మాత్రమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని స్థానిక రైతు బజార్‌లో సోమవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, 60 ఏండ్లు నిండిన ప్రతీ కార్మికుడికి రూ.5000 పెన్షన్ మంజూరు చేయాలన్నారు. వెల్ఫేర్ బోర్డు సభ్యత్వం పొందిన ప్రతీ కుటుంబానికి మోటర్ సైకిల్ వాహనం వెంటనే ఇవ్వాలన్నారు. ప్రభుత్వమే అడ్డాలు ఏర్పాటు చేసి.. షెడ్లు నిర్మాణం, మరుగుదొడ్లు, మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు సుమారు 20 లక్షల మంది ఉన్నారని.. వెల్ఫేర్ బోర్డులో 14 లక్షల మంది నమోదు చేసుకున్నప్పటికీ 8 లక్షల మంది మాత్రమే రెన్యూవల్ చేసుకున్నారన్నారు. ప్రభుత్వం కార్మికులందరికీ బోర్డ్ పేర్లు నమోదు చేయాలన్నారు. అసెంబ్లీలో భవన నిర్మాణ కార్మికులకు లక్ష బైకులు ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ.. నేటికి అమలు చేయడం లేదన్నారు. భవని ర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమ ంలో భవన నిర్మాణ యూనియన్ నాయకులు, పెంటయ్య, ముత్యాలు, సంగమేశ్వర్, రాజేష్, మొగులయ్య, యాద య్య, దుర్గయ్య, రత్నం, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కేతకి ఆలయం

నవతెలంగాణ-ఝరాసంగం

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు భారీ సంఖ్యలో బారులు తీరారు. సోమవారం అమావాస్య సందర్భంగా భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచి స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తదితర ప్రాంతాల భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కి రిసిపోయాయి. ముందుగా భక్తులు ఆలయంలోని స్వామివారి అమృత గుండంలో స్నానాలు ఆచరించి జల లింగానికి పూజలు నిర్వహించిన అనంతరం 'ఓం నమశ్శివాయ అనే పంచాక్షరి నామాన్ని స్మరిస్తూ' గర్భాలయంలోని శ్రీ పార్వతీ సమేత కేతకి సంగమేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాగా భారీగా తరలివచ్చిన



భక్తులకు స్వామివారి దర్శనం కోసం నాలుగు గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ పాలక వర్గం అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

4 నెలలుగా జీతాలివ్వకుంటే.. కార్మికులు ఎలా బతుకుతారు

- మీకు లక్షల జీతం.. కార్మికులకు మాత్రం రూ.7500 ఇవ్వలేకపోతున్నారా?
- మిషన్ భగీరథ కార్మికుల సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు



నవతెలంగాణ-సంగారెడ్డి

4 నెలల నుంచి జీతాలు చెల్లించకుంటే కార్మికుల కుటుంబాలు ఎలా బతుకుతాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'మీకు లక్షల జీతం వస్తుంది.. కార్మికులకు మాత్రం రూ.7500 జీతం ఇవ్వలేకపోతున్నారా' అని పాలకులను మండిపడ్డారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో సోమవారం మిషన్ భగీరథ కార్మికుల జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జి.సాయిలు మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోగల మిషన్ భగీరథ పంప్ హౌస్ వద్ద కార్మికులతో రెండ్రోజులుపాటు పర్యటన చేసి కార్మికుల సమస్యలు తెలుసుకున్నట్టు చెప్పారు. జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా వివిధ కాంట్రాక్టులు ఉన్న కెఎల్ఎస్అర్, జీకేఆర్ మెగా, ఎవరెస్ట్, ప్రీమియర్, ఎల్అండ్‌టీ కాంట్రాక్టర్లు ఎక్కడా కూడా కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. రూ.7500 నుంచి పదివేల వరకు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ కూడా అమలు చేయడం లేదన్నారు. స్వయానా సీఎం కేసీఆర్ పర్యవేక్షణ చేస్తున్న మిషన్ భగీరథ సంస్థలో.. కార్మికులకు ఇలాంటి తక్కువ వేతనాలు ఉండడం సిగ్గు చేటన్నారు. వారికి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. జీకేఆర్ సంస్థలో 10 ఏండ్ల నుంచి పనిచేస్తున్నప్పటికీ.. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయట్లేదని, చట్టపరమైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఆ సంస్థపై లేబర్ అధికారులు కేసులు నమోదు చేయాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని ఇతర సమస్యలు పరిష్కరిం చాలని రేపు(బుధవారం) నిర్వహించతలపెట్టిన ఎస్సీ ఆఫీస్ ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, మిషన్ భగీరథ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్, రాములు, జిల్లా నాయకులు కే. రాములు, కృష్ణ, ప్రభాకర్, వెంకటేష్, నర్సింలు, బిచ్చయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'మీ ఖద్దరు బట్టల పదవులు' కాంగ్రెస్ పుణ్యమే

- జిల్లా ఎమ్మెల్యేను ఉద్దేశించి.. కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు, జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు కొల్కూరి నర్సింహరెడ్డి వ్యాఖ్య



నవతెలంగాణ-పటాన్‌చెరు

'మీ కద్దరు బట్టలు పదవులు కాంగ్రెస్ పుణ్యమే' అని మర్చిపోవద్దని కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ధ్వజమెత్తారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పై ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలు 'దయ్యాలు వేదాలు వల్లించినట్టే ఉన్నది' అంటూ తీవ్రంగా ఖండించారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో సమైక్య పార్టీలకు ఊడిగం చేసిన వాళ్ళు కొంతమంది కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎంపీపీ, ఎంఎల్‌సి, జెడ్పీటీసీ పదవులు పొంది.. ఆస్తులు, అంతస్తులు సంపాదించి కాంగ్రెస్‌ని తిట్టడం సిగ్గుచేటన్నారు. ఈ జిల్లా నుంచి పరిశ్రమల సీఎస్సార్ నిధులు కోట్ల రూపాయలను సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లకు తరలించినప్పుడు, గతంలో మంజీర నీటిని ఇతర జిల్లాలకు తరలించినప్పుడు, అలాగే బడ్జెట్ నిధులు ఈ జిల్లాకు ఇవ్వకుండా ఇతర నియోజకవర్గాలకు తరలించినప్పుడు మంత్రి హరీశ్‌రావుపై నోరు మెదపని బీఆర్ఎస్ జిల్లా ప్రజా ప్రతినిధులు.. కాంగ్రెస్‌పై, రేవంత్‌రెడ్డి పై ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. సంగారెడ్డి జిల్లాలోని 5 నియోజక వర్గాల్లో మొదటి నుంచి బీఆర్ఎస్ జెండా మోసిన ఉద్యమకారులను బొందపెట్టిన ఘనత హరీశ్‌రావుదని ఆరోపించారు. 24 గంటల ఉచిత కరెంటు విషయంలో పటాన్‌చెరు సబ్ స్టేషన్ వద్ద చర్చకు రండి అని ఎమ్మెల్యేలు చేసిన సవాల్‌కు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. నేడు(మంగళవారం) ఉదయం 11 గంటలకు పటాన్‌చెరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అధికా రులను కలుస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో 5 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఓటమి తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ కాంగ్రెస్ సెల్ అధ్యక్షులు హనిబ్, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు కుంచాల కిషన్, హమిత్ పాష, ఉమ్మర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

12వ రోజుకు పంచాయతీ కార్మికుల సమ్మె



నవతెలంగాణ-కొండాపూర్

సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా గత 12 రోజుల నిరవధిక సమ్మె చేస్తున్నారు. కాగా ప్రభుత్వం స్పందించేంతవరకు సమ్మె విరమించబోమని వారు స్పష్టం చేస్తున్నారు. కొండాపూర్ మండల కేంద్రంలో చేపట్టిన సమ్మె శిబిరాన్ని సోమవారం సీఐటీయూ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సాయిలు, కేవీపీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అశోక్ వేరువేరుగా సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. కార్మికులను పర్మినెంట్ చేస్తామని, వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి గతంలో అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు అత్యధికులు దళితులు కావడం వల్లే ప్రభుత్వం వివక్షత పాటిస్తున్నదన్నారు. జీవో నెంబర్ 51 ద్వారా మల్టీపర్పస్ విధానాన్ని తీసుకువచ్చి కార్మి కులకు పని భారాన్ని పెంచడం సరైనది కాదన్నారు. వేతనాలు పెంచమంటే పని భారం పెంచుతారా! అని ప్రశ్నించారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు కనీసం ఎక్స్‌గ్రేషియా, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రభుత్వం ఇవ్వలేకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర బీజేపీ సర్కార్ నేడు టెంట్ల వద్ద మద్దతు ఇచ్చినప్పటికీ.. అసలు కార్మికుల ప్రాథమిక హక్కులను కేంద్ర బీజేపీ ప్రభు త్వమే కాలరాస్తున్నదన్నారు. కార్పొరేట్లకు ఉపయోగపడే నాలుగు లేబర్ కోట్లను తెచ్చి కార్మికుల పొట్ట కొడుతున్నదన్నారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచినా ఘనత బీజేపీ సర్కార్‌దేనని విమర్శించారు. కాగా తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జేఏసీని ఆహ్వానించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాజయ్య, సహాయ కార్యదర్శి రామచందర్, సీఐటీయూ మండల కన్వీనర్ బాబురావు, గ్రామ పంచాయతీ యూనియన్ మండలాధ్యక్షులు వెంకయ్య, ఉపాధ్యక్షులు సంజీవులు, రాజు, సహాయ కార్యదర్శి భాస్కర్, కవిత, గ్రామపంచాయతీ కార్మికులు సుశీల, శేఖర్, బిక్షపతి, అనంతయ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎంపీపీ

నవతెలంగాణ-చేగుంట



అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స చేయించుకుంటున్న వారికి సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అన్నారు. చేగుంట పట్టణ కేంద్రంలో గ్రామానికి చెందిన గడ్డమీద స్వరూపకు సోమవారం రూ.36 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతే ముఖ్యమంత్రి పాలనలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రంలో మరోసారి కేసీఆర్ పాలన రాబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపూర్ మాజీ పిఏసిఎస్ సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డి, బాలేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణ అంటే టీ కప్పులేనా?

- గుంతల రోడ్లు.. బురదతో కాలనీలు
- మెదక్ ప్రజల అవస్థలు పట్టని ఎమ్మెల్యే
- మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజుద్దీన్



నవతెలంగాణ-మెదక్ : మెదక్ పట్టణంలో సుందరీకరణ పనులు పడకేశాయని, అభివృద్ధి అంటే కప్పు, సాసర్‌లా అని మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజుద్దీన్ ఆరోపించారు. సోమవారం మెదక్ పట్టణంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మెదక్ పట్టణం గుంతల మయమైన రోడ్లు, బురదతో అంద వికారంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి సీసీ రోడ్లు తవ్వడం తప్ప కొత్తగా వేసిందేమి లేదన్నారు. మిషన్ భగీరథ పేరిట తవ్విన సీసీ రోడ్లను ఇప్పటివరకు నిర్మించలేదన్నారు. దీంతో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతమన్నారు. అనేక కాలనీలల్లో రోడ్లు డ్రైనేజీ లేక దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, ఫలితంగా రోగాలు వచ్చే అవకాశం ఉందని వాపోయారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా ఎమ్మెల్యే ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుందరీకరణ కోసం నిధులు విడుదలైనా ఇప్పటి వరకు ఎందుకు పనులు జరగడం లేదని ప్రశ్నించారు.

పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎస్పీ



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం తూప్రాన్ డిఎస్పి యాదగిరి రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ని కేసులు నమోదయ్యాయని, అందులో ఎన్ని పరిష్కరించారని. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని ఎస్సై శివ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సీఐ షేక్ లాల్ మదర్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం

ట్రాన్స్ కో ఏడిఈ మోహన్ బాబు

నవతెలంగాణ-మెదక్ టౌన్

జిల్లా కేంద్రంలోని 132 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మత్తులు, కొత్త పిటిఆర్ ఏర్పాట్ల దృష్ట్యా మంగళవారం మెదక్ పట్టణంతో పాటు మెదక్, హవేలీ ఘనపూర్, చిన్న శంకరంపేట మండలాలలో మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్ కో ఏడిఈ మోహన్ బాబు సోమవారం తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బందికి పట్టణ, గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఇన్‌స్పైర్ ఇంచార్జ్ ఉపాధ్యాయులకు అవగాహన

నవతెలంగాణ-మెదక్

ఇన్ స్పైర్ మనక్ విద్యార్థుల నామినేషన్లపై మంగళవారం జిల్లాలోని అన్ని యాజమాన్యాలలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మెదక్ డివిజన్ పరిధిలో గల పాఠశాలల ఉపాధ్యాయులకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి తూప్రాన్, నర్సాపూర్ డివిజన్ పరిధిలోగల పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతి పాఠశాల నుండి ఒక ఇన్ స్పైర్ ఇంచార్జ్ ఉపాధ్యాయుడిని పంపించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

ఐఐటిలో సీటు సాధించిన మానసకు సన్మానం



నవతెలంగాణ- చేగుంట

చేగుంట మండలం ఎస్ ఎల్ వి ఫంక్షన్ హాల్లో సోమవారం జేఈఈలో ఉత్తీర్ణత పొంది ఐఐటి కాన్పూర్‌లో సీట్ సాధించిన చింతల మానసను దుబ్బాక శాసనసభ్యులు మాధవనేని రఘునందన్ రావు శాలువతో సన్మానం చేసి అభినందించారు. అనంతరం విద్యార్థికి స్వీట్ తినిపించారు. మానసకి గిఫ్టుగా లాప్టాప్ అందిస్తానని రఘునందన్ రావు హామీ ఇచ్చారు. దుబ్బాక మండలం అచ్చిమయ్యపల్లి గ్రామానికి చెందిన చింతల మానస జేఈఈ లో సీట్ సాధించడం ఎంతో సంతోషమని, భవిష్యత్తులో వారు చదువుకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

బీజేపీని పటిష్టం చేయడమే లక్ష్యం

దుబ్బాక ఎమ్మెల్యే



నవ తెలంగాణ- చేగుంట

బీజేపీని బూత్ స్థాయి నుంచి రాష్ట్రంలో మరింత పటిష్టం చేయడమే లక్ష్యమని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు పేర్కొన్నారు. చేగుంట మండలం వడియారంలోని ఎస్ ఎల్ వి ఎన్ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన మెదక్, జహీరాబాద్ లోక్ సభ ప్రభాస్ యోజన కార్యక్రమానికి కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల ముఖ్య అతిథిగా హాజరై పార్టీ బలోపేతానికి తీసుకోవలసిన చర్యల గురించి వివరించారన్నారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధి బీజేపీని అధికారంలోకి తీసుకురావడం లక్ష్యంగా పనిచేయాలని కేంద్ర మంత్రి తెలిపారని. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని 14 నియోజకవర్గాల పరిధిలోని ప్రతి బూత్ కమిటీని పటిష్టం చేసి వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలో అధికారంలోనికి రావడానికి పరిచయమైన చర్యలు తీసుకుంటున్నామని అలాగే తెలంగాణలో బీజేపీని పటిష్టం చేయడానికి కృషి చేస్తున్నామని రంగమ్మ మంగమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ , జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నాయకులతో పాటు మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ కార్యదర్శి విజయ్ సుధాకర్ రెడ్డి, అధ్యక్షులు భూపాల్, రాష్ట్ర ఓబిసి బీజేపీ కార్యవర్గ సభ్యుడు గణేష్, మాజీ సర్పంచ్ బాలచందర్, మాజీ ఎంపీపీ పాండు, జిల్లా కార్యదర్శి ఎల్లారెడ్డి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు లావణ్య, నర్సింలు, పట్టణ అధ్యక్షుడు సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ కార్యదర్శి రాజిరెడ్డిపై అధిష్టానం వేటు..!

నవతెలంగాణ- కొల్చారం

పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డిపై అధిష్టానం వేటు వేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల గాంధీభవన్‌లో పీసీసీ ఉపాధ్యక్షులు, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ గాలి అనిల్ కుమార్‌పై రాజిరెడ్డి అసభ్యకరంగా మాట్లాడడం పట్ల పార్టీ కార్యకర్తలు అధిష్టానం దృష్టికి తీసుకుపోయినట్లు తెలిసింది. స్పందించిన పార్టీ క్రమశిక్షణ కమిటీ రాజిరెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పు పట్టింది. దీంతో పార్టీకి నష్టం చేకూరుతుందన్నారు. ఇలాంటి అసభ్యకరంగా మాట్లాడటం సరైంది కాదన్నారు. దీంతో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డికి పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీస్‌ను జారీ చేసింది. ఇచ్చిన గడువులోగా పూర్తి వివరణ ఇవ్వాలని పార్టీ ఆదేశించినట్లు తెలిపింది.

నేడు రైతు వేదికలో రైతులతో సమావేశం

నవతెలంగాణ-నంగునూరు

ఆర్థిక,వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు నేడు నంగునూరు మండలం పాలమాకుల గ్రామ రైతు వేదికలో ఉదయం 11.00 గంటలకు రైతుల సమావేశం జరుగుతుందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్ పట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్లాడిన విధానాలకు నిరంకుశ వైఖరికి నిరసనగా పాలమాకుల గ్రామ రైతు వేదిక నందు సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాలమాకుల, రాజగోపాల్ పేట, ముండ్రాయి, బద్దిపడగ, దర్గపల్లి,జేపీ తండా గ్రామాల రైతులతో సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. నంగునూరు మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు, యువజన విభాగం నాయకులు, మహిళా విభాగం నాయకులు, రైతుబంధు సమితి మండలంలోని గ్రామ శాఖ అధ్యక్షులు, సభ్యులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రతి ఒక్కరు పాలమాకుల రైతువేదిక వద్దకు రైతులను తీసుకవచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఓవర్ లోడ్లతో పాడవుతున్న రోడ్లు

- కంకర రోడ్డు మీద పడడంతో రాత్రిపూట రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని ఆయా శాఖల అధికారులు

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

మెదక్-బోధన్ ప్రధాన రహదారిపై నిత్యం ఓవర్‌లోడ్‌లతో టిప్పర్లు, భారీ వాహనాలు వెళుతుండడంతో రోడ్లు పాడవుతున్నాయి. రోడ్లు పాడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిమితికి మించిన బరువును సరఫరా చేయడంతో మండలంలో ఉన్న ప్రధాన రహదారిలో గుంతలు ఏర్పడుతున్నాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. హవేలిఘనపూర్ మండలంలో మెదక్-బోధన్ ప్రధాన రహదారి నుంచి నిత్యం టిప్పర్లలో కంకరను తరలిస్తున్నారు. హవేలీ ఘనాపూర్ మండలంలో ఉన్న ప్రధాన రహదారి మెదక్-బోధన్ రహదారి గుండా ఎల్లారెడ్డి, గోపాల్ పేట్ వంటి ప్రాంతాలకు కంకర లోడు ఇష్టం వచ్చినంత బరువు వేసుకొని వెళ్లడంతో మండలంలో ఉన్న రోడ్డు ధ్వంసం అవుతుందని మండల ప్రజలు వాపోతున్నారు. టిప్పర్లలో తరలించడంతో మండల పరిధిలో ఉన్న రాయిన్ చెర్వు, శాలి పేట్ గేటు వద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ గుంతల గుండా వాహనదారుల ప్రయాణికులు ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌పై ఆయా శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించకపో వడం పట్ల ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కడప కడపకూ కాంగ్రెస్

- అధికారంలోకి రాగానే రూ.500లకే గ్యాస్ సిలిండర్
- నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన
- వృద్ధాప్య పింఛన్లు రూ.3000లు
- జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి తిరుపతిరెడ్డి

నవతెలంగాణ-నిజాంపేట

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. ఈ మేరకు నిజాంపేట మండలపరిధిలో రజాక్ పల్లి, ఖాసింపూర్, ఖాసింపూర్ తాండ, గ్రామాలలో గడపగడపకు కాంగ్రెస్ పల్లె పల్లెకు కాంగ్రెస్ అనే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ పల్లె పల్లెకు కాంగ్రెస్ అనే కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఖాసింపూర్ గ్రామంలో గ్రామస్తులు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి తమ సమస్యలను పరిష్కరించడం లేదని ఖాసింపూర్ గ్రామ తండావాసులు తమతో చెప్తున్నారన్నారు. నాలుగు సార్లు ప్రజా ప్రతినిధిగా ఓటు వేసి గెలిపించుకున్నందుకు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఖాసింపూర్ తండా నుంచి తిప్పనగుల్ల గ్రామం వరకు రోడ్డు వేస్తానని చెప్పి వేయలేదని. ఎమ్మెల్యే గెలిచిన తర్వాత గ్రామానికి మొఖం చూపించలేదని గ్రామస్తులు ఆరోపించారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. రూ.2000 ఉన్న పెన్షన్ రూ.3000కు అందిస్తామని. మహిళా సోదరీమణులకు రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టుకునే వారికి రూ.5 లక్షలు అందజేస్తామన్నారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉంటానని మీ ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మండల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఖాసింపూర్ గ్రామంలో గ్రామానికి చెందిన 50 మంది



యువకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, బిసి సెల్ అధ్యక్షులు పల్లె రామచంద్ర గౌడ్, మండల అధ్యక్షులు లింగం గౌడ్, పట్టణ అధ్యక్షులు నసిరుద్దీన్, సేవాదళ్ అధ్యక్షులు ముత్యాల మధుసూదన్ రెడ్డి, సిద్ధ రాములు, మాజీ సొసైటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి చింతల స్వామి, ధరావత్ విటల్, కాకి రాజయ్య, సులేమాన్, బాగుల్ గౌడ్, నారా గౌడ్, భూమా గౌడ్, వెంకట్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను విమర్శించడం ఎమ్మెల్యేకు తగదు

- ఎమ్మెల్యే కార్యక్రమాలను అడ్డుకుంటాం
- టీపీసీసీ రాష్ట్ర నాయకులు అంజనేయులు గౌడ్

నవతెలంగాణ-నర్సాపూర్

టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు దొంగలు అని. స్థానిక ఎమ్మెల్యే మదన్ రెడ్డి విమర్శించడం తగదని టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్ అన్నారు . సోమవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు .ఎమ్మెల్యే మదన్ రెడ్డి 9 సంవత్సరాల పాలనలో నర్సాపూర్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అభివృద్ధి చేయలేని ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులను విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఉచిత విద్యుత్ పథకాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలుపరచలేదన్నారు. టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావులు, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి పై లేనిపోని ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు .ఇకముందు రేవంత్ రెడ్డి పై ఆరోపణలు చేస్తే ఖబర్దార్ అని ఆయన హెచ్చరించారు. టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులకు స్థానిక ఎమ్మెల్యే మదన్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు . లేని పక్షంలో నర్సాపూర్



నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్ రెడ్డి కార్యక్రమాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు అశోక్ గౌడ్ ,నాయకులు సురేష్ నాయక్, ఉదయ్ కుమార్ , నరసింహ చారి, రాధాకృష్ణ, రషీద్, శ్రీశైలం యాదవ్, దేవి సింగ్, రవిశంకర్, వీరేశం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మూడు పంటలు కావాల్నా? మూడు గంటల కరెంటు కావాలా?

- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపాటు
- నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి

నవతెలంగాణ-వెల్దుర్తి

తెలంగాణ రైతాంగానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రైతులకు మూడు పంటలు కావాల్నా? మూడు గంటలు కరెంట్ కావాలా? అనే విషయాలపై ఎమ్మెల్యే మదన్ రెడ్డి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. సోమవారం మాసాయిపేట మండల కేంద్రం రైతు వేదికలో ఉచిత కరెంటుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రేవంత్ రెడ్డి వాక్యాలు తెలంగాణ రైతాంగాన్ని కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో మూడు గంటల పాటు కరెంటు ఇచ్చేవారని రైతులు తమ బోర్ల వద్ద కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియని వైనం ఉండేదన్నారు. అర్ధరాత్రి దొంగ కరెంటు లాగా కరెంట్ వస్తే చాలామంది రైతులు కరెంట్ షాక్‌లో



గురై చనిపోవడం జరిగిందని గుర్తు చేశారు. రైతులు పండించిన పంటను కొనేవాళ్ళు లేక దళారుల పాలై మోసపోయారని మరోసారి గుర్తు చేశారు. రైతులు తమ ఎరువుల బస్తాల కొనుగోలు చేయడానికి లైన్లో రోజుల తర్వాత నిలబడి సొమ్మసిల్లి పడిపోయి చనిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. కొద్దిపాటి వర్షం కురిస్తే మూడు నాలుగు రోజుల వరకు కరెంటు కూడా రాని పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్ళు కరెంటు గురించి మాట్లాడడం రైతులు గమనిస్తున్నారన్నారు. తెలంగాణ రాగానే కేసీఆర్ రైతులకు ఉచిత కరెంటు రైతు బంధు పథకం రైతు బీమా సకాలంలో రైతులకు కొరత లేకుండా అవసరాన్ని బట్టి రైతులకు ఫర్టిలైజర్స్ అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రతిపక్ష నేతలు ఉన్నటువంటి వరకు చాలా సందర్భాల్లో వడ్ల గురించి ధర్నా చేశారు. కేవలం అది వాళ్ళ సొంత లబ్ధి కోసమేనన్నారు. వర్షం పడి వడ్లు తడిసిన ప్రభుత్వం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం లో భూముల విలువ బాగా పెరిగిందన్నారు. దీనికి కారణం కాళేశ్వరం డ్యామ్ వలన వ్యవసాయానికి నీళ్ళ రావడం, 24 గంటలు కరెంటు రావడం, పంటలు బాగా పడడం, రైతు శ్రీమంతుడు కావడమేనన్నారు. ప్రతిపక్ష నాయకులు మాట్లాడే ముందు గతాన్ని గుర్తుచేసుకొని మాట్లాడాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రైతు సంఘం ప్రతిపక్ష నాయకులకు గట్టిగా బుద్ధి చెప్పే తరుణం ఆసన్నమైందన్నారు. బీజేపీకి ఈ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి, జెడ్పిటిసి రమేష్ గౌడ్, స్థానిక సర్పంచి మధుసూదన్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్ కోఆప్షన్ మన్సూర్, ప్రజా ప్రతినిధులు అధికారులు, అనధికారులు రైతులు ప్రజలు పాల్గొన్నారు.

ఒక గంట ఆరోగ్యానికి కేటాయించాలి

- 10కే రన్ ప్రారంభించిన సీపీ శ్వేత, అడిషనల్ డీసీపీ మహేందర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ప్రతిరోజు ఒక గంట మన ఆరోగ్యం కాపాడుకునేందుకు కేటాయించాలని సిద్దిపేట సీపీ శ్వేతారెడ్డి అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 10కేరన్ కార్యక్రమాన్ని అడిషనల్ డీసీపీ మహేందర్ జెండా ఊపి ప్రారంభించారు. 10కేరన్‌కు సీపీ శ్వేతారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ శ్వేతారెడ్డి మాట్లాడుతూ డబ్బులు ఉంటే దాచుకోవాలని, శరీరంలో ఉండే క్యాలరీస్‌లను ఖర్చు చేయాలని అన్నారు. హుస్నాబాద్ చైతన్యాన్ని అందరికీ తెలియపరిచే విధంగా రన్ నిర్వహించడం జరిగిందన్నారు. మంత్రి తన్నీరు హరీష్ రావు చొరవతో రంగనాయక సాగర్ ప్రాజెక్టుపై ఆగస్టు 6న హాఫ్ మారథాన్ రన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సిద్దిపేట జిల్లా యువతి, యువకులు ప్రజలు ప్రజాప్రతినిధులు ఇతర జిల్లా యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈవెంట్ ఆహ్లాదకరమైన వాతావరణంలో అత్యద్భుతంగా పండుగ వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలని ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యాన్ని మించింది మరొకటి లేదన్నారు. ప్రతిరోజు



వాకింగ్, రన్నింగ్, యోగా, ధ్యానం, స్విమ్మింగ్, తప్పకుండా చేయాలని సూచించారు. సిద్దిపేట హాఫ్ మారథాన్ లో పాల్గొనేందుకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ లింక్ ఓపెన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లోఅడిషనల్ డీసీపీ అడ్మిన్ ఎస్ మహేందర్, హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఎడబోయిన రజని, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఐలేని అనిత, హుస్నాబాద్ ఏసిపి సతీష్, సీఐ ఎర్రాల కిరణ్, ఎస్ఐ మహేష్, అక్కన్నపేట ఎస్ఐ వివేక్, హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల వెంకన్న, ఉపాధ్యక్షులు బోడుమల్ల సంపత్ కార్యవర్గ సభ్యులు, హుస్నాబాద్ పట్టణ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు యువతీ, యువకులు, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తుల బాపిరెడ్డి, కార్యవర్గ సభ్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటాబందీ వీఆర్‌ఏలను పాత పద్ధతిలోనే కొనసాగించాలి

సంఘం జిల్లా కార్యదర్శి చందా రాజు

నవతెలంగాణ-తొగుట

గ్రామ రెవెన్యూ సహాయకులుగా పని చేస్తున్న వారిని ఓటాబందీ పద్ధతిలో కొనసాగించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి చందా రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు ఒకసారి వంతులవారీగా మారుతూ పని చేస్తు వారి కుటుంబాలు పోషించుకుంటున్నారని తెలిపారు. కొన్ని శతాబ్దాల క్రితం 0.50 పైసల వేతనం తీసుకుంటూ గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ అధికారులకు సేవలు అందిస్తూ గ్రామాల అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి హయాంలో క్రమ పద్ధతిలో అప్పుడు ఎవరు పని చేస్తున్నారో వారినే పర్మినెంట్ వీఆర్‌ఏలుగా రికార్డుల్లో పేర్లు నమోదు చేశారన్నారు. ఏపీపీఎస్సి ద్వారా ప్రభుత్వం దాదాపు 3 వేల మంది వీఆర్‌ఏలను నియమించిందన్నారు. మే నెల 18న జరిగిన క్యాబినెట్ సమావేశంలో సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తా మని ప్రకటించారలని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వడం లేదు

- సబ్ స్టేషన్ సందర్శించిన కాంగ్రెస్ బృందం
- రుణమాఫీ చేయని ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వం
- టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూజాల హరికృష్ణ

నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వడం లేదు. ఈ విషయం సబ్ స్టేషన్‌లో ఉన్న లాక్‌బుక్, ఎల్‌సి బుక్ చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది' అని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూజల హరికృష్ణ అన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఉన్న సబ్ స్టేషన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటికైనా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేయడం మానుకోవాలన్నారు. ఎక్కడా తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇస్తలేరని అర్థమైందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఎక్కడ ఇస్తున్నారో మంత్రి హరీశ్‌రావు చెప్పాలని కోరారు. కనీసం ఇంతవరకు రుణమాఫీ చేయని ఘనత బీఆర్ఎస్



ప్రభుత్వానిది అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేయడం మానుకోవాలన్నారు. రాబోయే ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రైతులను ఆదుకునే పార్టీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఓకే విడతలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషేర్మెన్ సెక్రెటరీ గౌటి బాబేష్, గ్రామశాఖ అధ్యక్షులు బిట్ల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బాగన్న కరుణాకర్, ఎస్సీ సెల్ రూరల్ మండల అధ్యక్షులు కోదాది రమేష్, నాయకులు గుండుకడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం మంజూరు చేయాలి



నవతెలంగాణ-అక్కన్నపేట : సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రానికి అత్యవసర వేళలో ఆదుకునే 108 వాహనం ప్రభుత్వ కేటాయించకపోవడం బాధాకర మని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య సోమవారం తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యవసర సమయంలో 108 వాహనం ఎంతో కీలకమని, అలాంటి సౌకర్యాన్ని మండల ప్రజలకు కల్పించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. మండలంలో అధిక శాతం గిరిజన జనాభా వ్యవసాయ ఆధారిత కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, వ్యవసాయ బావుల వద్ద ఏమైనా సంఘటనలు జరిగితే హుస్నాబాద్ మండల కేంద్రం నుండి రావాలంటే కొన్ని సమయాల్లో వాహనం అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. కొన్ని సందర్భాల్లో 108 వాహనం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో అక్కన్నపేట ప్రజలకు సరైన సమయంలో రాక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చేసేది ఏమీ లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. ఉమ్మడి హుస్నాబాద్ మండలానికి ఒకే వాహనం ఉండడంతో రెండు మండలాల ప్రజలకు సేవలు అందించలేక పోతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని పాలకులు గ్రహించి 108 వాహనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఆషాడ మాస ముగింపు ఉత్సవాలు



నవ తెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని మార్కెట్ చౌరస్తా వీరహనుమాన్ దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ అయిత రత్నాకర్ ఆధ్వర్యంలో ఆషాడ మాస ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. కలశ స్థాపన, సుందరకాండ పారాయణం, అఖండ భజన నిర్వహించారు. ఆంజనేయ స్వామి యొక్క విగ్రహాలను పట్టణ వీధుల గుండా ఊరేగింపు చేసి, చక్రస్నానం నిమిత్తం కోమటి చెరువు వరకు ఊరేగింపుగా వెళ్లారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈఓ రవికుమార్, ఆలయ పూజా రి రాఘవాచారి, చందు, భక్తులు ఆత్మరాములు, హరి, ధనుంజయ, వెంకట్, అనిల్, అశోక్ రాజు ధర్మపురి, చరణ్, కిషన్, నాగభూషణం ,అమర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై మహిళలకు అవగాహన



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలోని గోకులం ఫంక్షన్ హాల్‌లో బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. బెజ్జంకి, కోహెడ, చిన్నకోడూర్, తిమ్మాపూర్, గన్నేరువరం, ఇల్లంతకుంట మండలాల మహిళలు అవగాహన సదస్సుకు హాజరయ్యారు. డాక్టర్ వినోద్ బాబ్జీ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ బాలవికాస ప్రతినిధులు అన్నామేరీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా సీఎంరిలీఫ్ ఫండ్



- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

పేద ప్రజల సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసానిస్తుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధిలో నలుగురు లబ్ధిదారులకు రూ 1లక్ష 52 వేల రూపాయల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆపన్నహస్తంలా ఉపయోగపడుతుందన్నారు.వ్యాదుల బారిన పడి, చికిత్సకు నోచుకోలేని నిరుపేదల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం సహాయ నిధితో అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లకవత్ మానస సుభాష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, మీర్జాపూర్ సర్పంచ్ తరాల లతా మహేందర్, అక్కలపేట ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు యాస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటనతో జీపీ కార్మికుల నిరసన









నవతెలంగాణ-సిద్ధిపేట రూరల్

గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గత 12రోజులుగా నారాయణరావుపేట మండల కేంద్రంలో చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం పంచాయతీ కార్మికులు భిక్షాటన చేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు ప్రతి షాపునకు వెళ్లి తమ వంతుగా సహకారమందించాలని కోరుతూ భిక్షాటన చేశారు. జేఏసీ జిల్లా చైర్మన్ తునికి మహేష్ మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని తొలగిస్తూ మురుగును తీసేస్తూ తాము అనారోగ్యపాలవుతూ ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దిన తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని కార్మికులు కోరారు. కార్మికులను క్రమబద్ధీకరిస్తూ వేతనాలు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి అధికారులను పంపుతూ స్పెషల్ డ్రైవ్ పేరుతో గ్రామాలలో నాలుగు రోజులుగా కొత్తగా కార్మికులను పెట్టి పనులు చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. అందుకు మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామాలలో మేము చేసే పని మరొకరితో చేయిస్తే తక్షణమే అడ్డుకుంటామన్నారు. మా పొట్ట మీద కొట్టొద్దని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. ఈ నెల 18న ఎమ్మెల్యేల ఇంటిముందు ధర్నా, వినతిపత్రం, 19న మండల కేంద్రాల్లో ప్రజాసంఘాలు సామాజిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం, 20న టెంట్ల వద్ద కుటుంబ సభ్యులతో నిరసన దీక్ష , ఈ నెల 21న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అప్పటికి రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మంచినీటి సరఫరా నిలుపుదల చేస్తామని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర జేఏసీ నాయకులతో చర్చలు జరిపి జీవో 51ని సవరణ చేయాలని మల్టీపర్పస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు తునికి శ్రీకాంత్, నరేష్, కార్మికులు ప్రశాంత్, రాజయ్య, లక్ష్మి,భూపతి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదని నిరసిస్తూ సోమవారం నంగునూరు మండల కేంద్రంలో భిక్షాటన చేపట్టారు. నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంనందు గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరుకుంది. మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు ర్యాలీ ద్వారా ప్రధాన వీధుల్లో తిరుగుతూ బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ నాయకురాలు దేవులపల్లి బాల్ నరసవ్వ మాట్లాడుతూ సమ్మెను విచ్చినం చేయడానికి పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ కలిసి గ్రామ పంచాయతీలలో ప్రైవేట్ గా కూలి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని పోరాడుతుంటే మా సమస్యను పరిష్కరించకుండా కూలీలను పెట్టి పనులు చేయించడంలో మీ ఆంతర్యం ఏమిటో అర్థమవుతుందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం నుంచి వచ్చిన జీతాన్ని కూడా కలిపి మిగతా వారికి చెల్లించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామ జనాభా బట్టి గ్రామపంచాయతీ కార్మికులను నియమించకుండా గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు జాప్యం చేస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తే ఉద్యోగాలు పోతాయని బెదిరించడమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు దేవులపల్లి రాజమౌళి, నర్సింలు, కనకయ్య, బాలయ్య, రవి, కలవ్వ, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

జీపీ కార్మికుల పరిష్కరించాలని కోరుతూ కుకునూరు పల్లి మండల కేంద్రంలో కొండపాక ఉమ్మడి మండల గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె సోమవారానికి 12వ రోజుకు చేరుకున్నది. కుకునూరుపల్లి మండల కేంద్రంలో కార్మికులందరూ భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉమ్మడి మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ బిక్షటన చేయడం జరిగిందన్నారు.12 రోజుల నుంచి సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వానికి ఎలాంటి స్పందన లేకపోవడం చూస్తుంటే దున్నపోతు మీద వాన పడ్డ చందంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్ర జేఏసీ నాయకులతో చర్చించి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యోగ కార్మిక సంఘాల అన్నిటినీ సమీకరించి, ప్రజల అండదండలతో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బర్మ కొమురయ్య, మండల అధ్యక్ష కార్యదర్శులు ఆరుట్ల నర్సింలు, జాలిగామ ప్రభాకర్ నాయకులు కోడిపెల్లి చంద్రయ్య, నరహరి, ర్యాగల లక్ష్మణ్, భోగి సాయికుమార్, పంజా శ్రీనివాస్, నర్సింగరావు, పల్లె శ్రీనివాస్, కిష్టయ్య, లింగయ్య కొమ్ము నర్సింలు, తలపాక లక్ష్మి, పుష్ప, వెంకటమ్మ, ఎల్లవ్వ ఉమ్మడి మండల కార్మికులు పాల్గొన్నారు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన సమ్మె సోమవారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుర్గయ్య, మామిడి సంపత్, శ్రీనివాస్, తాడూరి లక్ష్మి,, సదానందం, నాగరాజు, కార్తీక్, తిరుమల, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-మద్దూరు

జనగామ నియోజకవర్గంలో డ్రైవింగ్ లైసెన్స్ లేని ప్రజలకు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తన సొంత ఖర్చుతో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ అందిస్తున్నారని. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల ఇంచార్జ్ పాకాల కిరణ్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలో ఉచిత డ్రైవింగ్ లర్నింగ్ లైసెన్స్‌లను యువతకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అందిస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లకు మద్దూరు ఎంపీపీ బద్దిపడే కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు యువత నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు

హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు పెంచాలి

- డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు



నవతెలంగాణ-వర్గల్

మండల కేంద్రంలోని ఎస్సి, బీసీ, హాస్టల్‌ను డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు సందర్శించి, కాస్మొటిక్ చార్జీలు, మెస్ చార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే రూ.62లు కాస్మొటిక్ చార్జీలు సరిపోవడం లేదని పిల్లలకు సరిపోయే విధంగా కాస్మొటిక్ చార్జీలు, మెస్ చార్జీలు పెంచాలన్నారు. బీసీ హాస్టల్లో బెడ్స్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హాస్టల్లో ఉండాల్సిన సౌకర్యాలు గ్రంథాలయం, రూమ్‌లో ఫ్యాన్స్‌లైట్లు, డైనింగ్ టేబుల్, క్రీడాలకు సంబంధించిన అన్ని సౌకర్యాలు, వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.

నడుస్తూ చెత్త వేరేద్దాం



నవతెలంగాణ-సిద్దిపేట

స్వచ్ఛ సిద్దిపేటలో భాగంగా ప్రతిరోజు వార్డులో నడుస్తూ చెత్త వేంటం వలన పట్టణం పరిశుభ్రంగా ఉంటుందని మంత్రి హరీశ్ రావు ఆదేశాలమేరకు 7, 8 వ వార్డులో చెత్తను ఎరివేసినట్లు కమిషనర్ సంపత్ కుమార్, మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, వార్డ్ కౌన్సిలర్ ముత్యాల శ్రీదేవి బుచ్చిరెడ్డి, వరాల కవిత సురేష్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గజ్వేల్‌లో కాంగ్రెస్ ఖాళీ

- ఎఫ్‌డీసీ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఖాళీ చేస్తున్నామని, కార్యకర్తలు నాయకులు భారీ ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో సీఎం మినీ క్యాంప్ కార్యాలయంలో వర్గల్ మండలం నెంటూరుతో పాటు ఇతర గ్రామాలు చెందిన కాంగ్రెస్ బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పార్టీలో చేరినట్లు ఆయన చెప్పారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి తెలంగాణ సంక్షేమ పథకాలకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు సామాజిక భవనాలు, సంక్షేమ పథకాల అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్గల్ ఎంపీపీ లతా రమేష్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎంపీటీ శ్యామల, నాయకులు షాదుల్లా, బిక్షపతి, మాజీ సర్పంచ్ పూజారి యాదగిరి గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, జయ రాములు గౌడ్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే కాంగ్రెస్‌పై పిచ్చి కూతలు

నవతెలంగాణ-నంగునూరు

రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటమి భయంతోనే కాంగ్రెస్ పై కేటీఆర్, హరీశ్‌రావులు పిచ్చి కూతలు కూస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మండిపడ్డారు. సోమవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న నిజాన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ ప్రభుత్వ మంత్రులు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి పైన కారుకూతలు కూస్తున్నారని పేర్కొన్నారు. అబద్దాలకూ కేరాఫ్ అడ్రస్ అయినా కేసీఆర్ కుటుంబం కాంగ్రెస్ పార్టీ, నాయకుల మీద బురద చల్లి సిగ్గులేకుండా అధికారం చేపట్టాలని చూస్తున్న కుయుక్తులు ఇక చెల్లవని గుర్తుంచుకోవాలని తెలిపారు. సిద్దిపేట దాటితే గెలువని హరీష్ రావు కూడా కాంగ్రెస్ పార్టీని, రేవంత్ రెడ్డిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ నాయకులపైన ఎదురు దాడికి దిగిన కేసీఆర్ కుటుంబానికి కర్రు కాల్చి వాతలు పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

వాసవీ సమితి ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌లో సోమవారం అమావాస్య అన్నప్రసాద వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో దిగవంత ఇల్లెందుల శంకరయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు సువర్ణ నరేందర్, రజనీ శ్రీనివాస్, శ్రీ సుధ సురేష్ సౌజన్యంతో దాదాపు మూడు వందల మందికి అమావాస్య అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాచారం దేవస్థానం డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని దానాలకన్న అన్నదానం మిన్న అని అమావాస్య రోజున అన్నదానం నిర్వహిస్తే మహా పుణ్యం లభిస్తుందని గత మూడు సంవత్సరాలుగా ప్రతి నెల అమావాస్య అన్నదానం నిర్వహించడానికి సహకరిస్తున్న ఆర్యవైశ్య సమాజానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు నంద బాల శర్మ కొండ పోచమ్మ దేవస్థానం డైరెక్టర్ గోలి సంతోష్, సిద్ధి బిక్షపతి, అత్తెల్లి లక్ష్మయ్య, తోట బిక్షపతి, అయిత సత్యనారాయణ, భద్రయ్య, దొంతుల సత్యనారాయణ, శివకుమార్, రుక్మయ్య, చకిలం కృష్ణమూర్తి, సిద్దేశ్వర్, సిరిపురం సత్యనారాయణ, గందే సంతోష్, మహేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-మద్దూరు

ఆర్టీసీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనగామ డిపో మండల విలేజ్ బస్ ఆఫీసర్ ఆడెపు కిషన్ కోరారు. ఈ సందర్భంగా ఆయన దూల్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపీ 9 టికెట్స్, వికలాంగుల బస్సు పాసులు.విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు పెళ్లిళ్లకు.విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల జిల్లా అధ్యక్షుడు మల్లేశం పాల్గొన్నారు.

ముగ్గురు మంత్రులు దుబ్బాకకు వస్తే ఒక్క రూపాయి అడగలేదు

- నిన్ను ఎన్నుకున్నది ఫొటోలు దిగేందుకేనా..?
- ఎమ్మెల్యేపై బీఆర్ఎస్ నేతల ఫైర్



నవతెలంగాణ-దుబ్బాక

బస్టాండ్ ప్రారంభోత్సవానికి ముగ్గురు మంత్రులు దుబ్బాకకు వస్తే ఒక్క రూపాయి కూడా అడగలేని ఎమ్మెల్యే రఘునందన్ రావు తాను వచ్చాకే దుబ్బాక అభివృద్ధి చెందుతుందనడం హాస్యాస్పదంగా ఉందని కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్ విమర్శించారు.గెలిచి రెండున్నరేళ్లు కావస్తున్నా రూపాయి తెచ్చిన దాఖలాల్లేవని కో-ఆప్షన్ సభ్యుడు ఆస స్వామి ఫైర్ అయ్యారు. సోమవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడారు. ముగ్గురు మంత్రులు వస్తే దుబ్బాకకు నిధులు కావాలని కనీసం వినతి పత్రం కూడా అందించకపోవడమే కాకుండా వారితో గొడవ పెట్టుకున్నారని, నిజంగా దుబ్బాక అభివృద్ధిని కాంక్షిస్తే మంత్రులను నిధులు కావాలని ఎమ్మెల్యే ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. దుబ్బాకపై ఎమ్మెల్యే రఘునందన్ రావుకు ఉన్న చిత్తశుద్ధి ఏంటో దీంతోనే నిరూపితమైందన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యం,మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక సహకారంతో తాము అభివృద్ధి చేస్తుంటే వాటి వద్ద ఇక్కడి ఎమ్మెల్యే ఫోటోలు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. తాను వచ్చాకే దుబ్బాక అభివృద్ధి జరిగిందని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నుకున్నది ఫోటోలు దిగేందుకేనా అని మండిపడ్డారు. తమ ప్రభుత్వాన్ని,ఎంపీ ప్రభాకర్ రెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రొట్టె రాజమౌళి, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, గన్నె భూమిరెడ్డి,పల్లె రామస్వామి గౌడ్, ఎంగారి రాజిరెడ్డి, కుమ్మరి నర్సింహులు, యాదగిరి ముదిరాజ్, పడాల నరేష్, దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాపూర్‌లో రాయటమ్మ జాతర



నవతెలంగాణ దౌల్తాబాద్

దౌల్తాబాద్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో సోమవారం రాయటమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డమీది భాగ్య ఎల్లం మాట్లాడుతూ రాయడమ్మ జాతరకు హైదరాబాద్ ఇతర ప్రాంతాల్లో వలస వెళ్లిన ప్రజలు స్వగ్రామానికి వచ్చి మొక్కలు చెల్లించుకున్నారని తెలిపారు. అమ్మవారి సేవలో పాల్గొన్న భక్తులు బోనాల ఊరేగింపు, గావు, రంగం ఎక్కడం జరిగిందన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

టీఆర్ఎస్ పాలనలోనే క్రైస్తవుల అభివృద్ధి

- మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు



నవతెలంగాణ- సిద్దిపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల అభ్యున్నతికి పెద్దపీట వేసిందని, మునుపెన్నడు లేని విధంగా ముఖ్యమంత్రి కెసిఆర్ క్రిస్టమస్‌ను అధికారికంగా జరుపుతున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. గాడిచర్లపల్లి శివారులో షాలేము క్యాంపస్ లో షాలేము సహవాస నాయకులు పాస్టర్ స్టీవెన్ జ్ఞాన కుమార్ ఆధ్వర్యంలో జిల్లా పాస్టర్స్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి హరీశ్ రావు కూడా సిద్దిపేట జిల్లాను రాష్ట్రానికె తలమణికంగా తీర్చిదిద్దరాని, పాస్టర్లు పలు సమస్యలను తెలపగ మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాస్తామని తెలిపారు. కరోనా సమయంలో స్టీవెన్ జ్ఞాన కుమార్ పేద పాస్టర్స్‌కు బియ్యం, వితంతులకు, వృద్ధులకు దుప్పట్లు, బట్టలు పంపిణి చేసి తన సేవాగుణాన్ని చాటరాని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మోహనబాబు, ప్రసాద్ చౌద్దరి, జోయేల్ జెశ్వంత్, కౌన్సిలర్లు సద్ది నాగరాజు రెడ్డి, నాయకం లక్ష్మణ్, ఎడ్ల అరవింద్ రెడ్డి, బిఆరెస్ నాయకులు వజీర్, మోయిజ్, జిల్లా పాస్టర్స్ పాల్గొన్నారు.

చేర్యాల సీఐని ఘనంగా సన్మానించిన రాజకీయ నాయకులు



నవతెలంగాణ-చేర్యాల : చేర్యాల సీఐ సత్యనారాయణ రెడ్డి శౌర్య పతకానికి ఎంపిక కావడం పట్ల సోమవారం పలువురు రాజకీయ నాయకులు మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి అభినందనలు తెలిపారు. సన్మానించిన వారిలో అందె అశోక్, బొమ్మగోని అంజయ్య గౌడ్, ఈరి భూమయ్య, ఆకుల శివయ్య గౌడ్, చెల్లన్నగారి రామోజీ, కూరెళ్ల యాదగిరి, చాట్ల ప్రసాద్, కంది ప్రసాద్, అందె బాలరాజు, ఏగుర్ల ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

అదృశ్యమైన మహిళ చెరువులో పడి మృతి



నవతెలంగాణ-రాయపోల్

అదృశ్యమైన మహిళ చెరువులో పడి మృతి చెందిన సంఘటన సయ్యద్‌నగర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలంలోని సయ్యద్ నగర్ గ్రామానికి చెందిన మహమ్మద్ పఠాన్ మదీన(35) కుటుంబ సభ్యులతో కలిసి రౌతు కొట్టే పని చేస్తుంటారు. పటాన్ మదీన రేచీకటి వ్యాధితో బాధపడుతుండటంతో ఆమెకు వివాహం కాలేదు. వీరిది ఉమ్మడి కుటుంబం కావడంతో కుటుంబ సభ్యులతోటే కలిసి జీవిస్తుంది. ప్రతిరోజులాగే శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత అందరు నిద్రించారు. శనివారం ఉదయం నిద్ర లేచేసరికి ఇంట్లో పటాన్ మదిన ఇంట్లో లేదు. రాత్రి అందరూ నిద్రించింది చూసి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె ఇంట్లో నుంచి వెళ్లిన నాటి నుండి ఆచూకీ కోసం గ్రామంలో, తెలిసిన ప్రాంతాలలో వెతికినప్పటికీ ఎక్కడ ఆచూకీ లభించలేదు. చివరికి కనబడటం లేదని పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రామానికి సమీపంలోని రామారం గ్రామంలోని రాందాస్ చెరువులో మహిళ మృతదేహం నీటిపై తేలింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతి దేహాన్ని వెలికతీసి పరిశీలించగా పఠాన్ మదీనగా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలు సోదరుడు మహమ్మద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు.

దేశానికి అన్నం పెట్టే రాష్ట్రంగా తెలంగాణ

- జెడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజా శర్మ



నవతెలంగాణ-చిన్నకోడూరు

బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని దేశానికి అన్నం పెట్టే రాష్ట్రంగా తెలంగాణ మారిందని జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ, ఎంపీపీ కూర మాణిక్య రెడ్డిలు అన్నారు. మంత్రి హరీశ్ రావు ఆదేశాల మేరకు మండలంలోని విఠలాపూర్ రైతు వేదికలో సోమవారం గంగాపూర్, రంగాయిపల్లి, విఠలాపూర్ గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రైతులకు కేంద్ర బిందువుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. 3 గంటల కరెంటు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీని, స్టార్టర్లకు మీటర్లు పెడతామన్న బీజేపీని రైతులు నమ్మ వద్దని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు నాయకత్వంలో పొలాలకు సాగునీరు అందించటంతో రైతులు బంగారు పంటలు పండిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలంగా మారాయన్నారు. గ్రామాల్లోని చెరువులు, కుంటలు, చెక్ డ్యాములు నీటితో నిండి కలకలలాడుతున్నాయన్నారు. సిద్దిపేట జిల్లాను మంత్రి హరీష్‌రావు ప్రాజెక్టుల ఖిల్లాగా మార్చినాడన్నారు. కడుపునిండా అన్నం పెట్టే రైతుకు ప్రభుత్వం అండగా నిలిచిందని దేశానికి అన్నం పెట్టే రాష్ట్రంగా తెలంగాణ మారిందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందించారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రైతుల ఆత్మహత్యలు ఉండేవని నేటి తెలంగాణ రాష్ట్రంలో రైతుకు ఆత్మగౌరవం దక్కిందన్నాడు. ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా మూడు గంటల కరెంటు వద్దు, మూడు పంటలు ముద్దు అని రైతులంతా తీర్మానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ, వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, జిల్లా రైతు బంధు సమితి సభ్యుడు మేడికాయల వెంకటేశం, డీసీసీబీ డైరెక్టర్ నముండ్ల రామచంద్రం, మండల రైతు బంధు సమితి చైర్మన్ పరకాల మల్లేశం గౌడ్, అల్లిపూర్ పిఏసిఎస్ చైర్మన్ బొడిగె సదానందం గౌడ్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కాముని ఉమేష్ చంద్ర, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఇట్టబోయిన శ్రీనివాస్, సర్పంచ్‌లు మద్దికుంట నవీన్, పన్యాల లింగారెడ్డి, సిద్దుల శ్రీనివాస్, ఎంపీటీసీలు సింగిరెడ్డి సునీత సాగర్ రెడ్డి, ఎడ్ల వెంకట లక్ష్మి యాదవరెడ్డి పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న మురుగు

సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ డిమాండ్



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు సీసీ రోడ్లు పూర్తి చేయాలని సీఐటీ యూ గజ్వేల్ డివిజన్ నాయకులు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డులలో ప్రజానీకం ఎక్కువగా నివసిస్తున్న కాలనీ లలో ముందుగా సిసి రోడ్డు పూర్తి చేయకుండా ప్రాధాన్యత లేని రోడ్లలో సిసి రోడ్లు నిర్మించినట్లు ఆయన చెప్పారు. వార్డులలోని అసంపూర్తిగా ఉన్న రోడ్లను వదిలేసినారని ఇదేమిటని ప్రజానీకం అడిగితే అదనపు నిధులు వస్తే కానీ చేయలేమని ప్రజా ప్రతినిధులు అధికారులు తెలపడం సిగ్గుచేటన్నారు. మాటలతో కాలం వెళ్ళదీస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలోని పట్టణ కేంద్రంలో ఈ దుస్థితేమిటన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. లేని పక్షంలో పట్టణ ప్రజలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్స్, వైశ్య భవనం కమిటీ, ఐ వి ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి చీరే, సారే సందర్భంగా కొత్త వెంకటేశ్వర దేవాలయం నుంచి వైశ్య భవనం వరకు మహిళలచే చీర, సారే ఊరేగింపుగా తీసుకువచ్చి వాసవి మాతకు సమర్పించారు. కుంకుమ పూజలు నిర్వహించారు. 108 చొప్పున 11 రకాలు ప్రసాదాలు తయారు చేయించి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలతో పాటు, దైవ కార్యక్రమాలు కూడా నిర్వహించడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు అయిత రత్నాకర్, వాసవి క్లబ్ మల్టిపుల్ ఉపాధ్యక్షుడు కొర్తివాడ రాజేందర్, వైశ్య భవనం కమిటీ అధ్యక్షుడు గట్టు రవీందర్, కార్యదర్శి బుచ్చయ్య, కోశాధికారి కూర శ్రీనివాస్, వాసవి క్లబ్ అధ్యక్షుడు చింత రాజేంద్రప్రసాద్ వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు అరవపల్లి హరికిరణ్, ఐవిఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు కాస్నగొట్టు స్వప్న, వాసవి క్లబ్ నాయకులు గంప కృష్ణమూర్తి, తడ్కమడ్ల శంకరయ్య, నేతి వేణు, మాంకాళ నవీన్, చకిలం రవి, చొక్కారపు శ్రీధర్,బూరుగు వేణుగోపాల్, మర్యాల వీరేశం, తిమ్మిశెట్టి వీరేశం, కొండూరు భాస్కర్, ఉప్పల రమేష్, కూర మోనయ్య బుక్క శివ, జూలూరు శ్రీనివాస్, తిమిశెట్టి విజయలక్ష్మి, చింత సరోజ, చకిలం వినోద,కూర మంజుల, జూలూరు సుజాత,చలిమెల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

యువత సమాజాభివృద్ధిపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-బెజ్జంకి

యువత చెడు వ్యసనాలకు బానిసవ్వకుండా సమాజాభివృద్ధపై దృష్టి సారించాలని యువజన సంఘాల మండలాధ్యక్షుడు అక్కరవేణి పోచయ్య సోమవారం సూచించారు. మహనీయుల ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకుని సమాజ చైతన్యంలో భాగాస్వాములవ్వాలని పోచయ్య తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమ్మె పట్ల వివక్ష తగదు



కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి
తక్షణమే జేఏసీని చర్చలకు పిలవాలి
సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప జేయాలి
కె.వి.పి.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్

నవతెలంగాణ - పటాన్ చెరు

గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమ్మె పట్ల వివక్ష తగదని కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కె.వి.పి.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. గత 12 రోజులుగా సమస్యల సాధన కోసం గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా ఆదివారం మండలంలోని ఇస్నాపూర్ చౌరస్తాలో శిబిరంను సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 12,769 గ్రామాలలో 50వేల మంది పంచాయతీ సిబ్బంది ఎండ వాన చలి లో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తున్నారన్నారు. వీరిలో నూటికి 80శాతం మంది దళితులేనని న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు,పంపు ఆపరేటర్లు,కారోబార్లు,ఎలక్ట్రిషియన్లు, బిల్ కలెక్టర్లు వంటి గ్రామ పంచాయతీ సిబ్బంది కరోన లాంటి క్లిష్ట పరిస్థితులలోకూడా తమ ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు.మోడీ స్వచ్ఛ భారత్ పిలుపు అయిన కేసీఆర్ ప చ్ఛదనం పరిశుభ్రత పిలుపు అయిన చిత్తశుద్ధితో అమలు చేసింది గ్రామ పంచాయితీ సిబ్బందేనన్నారు. వేతనాలు పెంచకపోవడంతో సిబ్బంది ఆరోగ్యాలు, పిల్లల చదువులు, సరైన భోజనం చేయలేకపోతున్నారన్నారు. వేతనాలు పెంచకుండా పని భారం పెంచడానికి జీవో నెంబర్ 51 ని రూపొందించి ఒకే కార్మికుడు అనేక పనులు చేయాలనే మల్టిపర్పస్ విధానాన్ని ప్రభుత్వం తెచ్చిందన్నారు. దీంతో కార్మికులపై పని భారం పెరుగుతుందని. మల్టిపర్పస్ విధానం రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని. న్యాయం, ధర్మం నీతి ఉంది కనుకనే.గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసమే నేడు సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. కార్మికులను పర్మినెంట్ చేస్తామని వేతనాలు పెంచుతామని ముఖ్యమంత్రి గతంలో అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాటలునిలబెట్టుకోలేదని పల్లెల్లో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల అత్యధికులు దళితులు కావడం వల్లే ప్రభుత్వం వివక్ష పాటిస్తుందా?అనే అనుమానం కలుగుతుందన్నారు. ప్రమాదవశాత్తు కార్మికులు మరణించినా కనీస ఎక్స్ గ్రేషియో ప్రభుత్వం ఇవ్వలేకపోవడం సిగ్గుచేటని.గ్రామ పంచాయతీ సిబ్బందికి పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించకపోవడం అన్యాయం కాద అని ప్రశ్నించారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సర్కార్ కార్మికుల హక్కులను కాలరాసే చర్యలకు ఒడిగట్టిందని విమర్శించారు. బీజేపీ నేతలు నేడు టెంట్ల వద్దకు వచ్చి మద్దతు ఇచ్చినప్పటికీ అసలు కార్మికుల ప్రాథమిక హక్కులను లేకుండా చేస్తున్నది బీజేపీ అనేది మరువకూడదన్నారు. కార్పొరేట్లకు ఉపయోగపడే 4 లేబర్ కోడ్ లను తెచ్చి కార్మికుల పొట్టలు కొట్టి కార్పొరేట్లకు మేలు చేస్తుందని. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిన ఘనత బిజెపి సర్కార్ దేనని .గత 9రోజులుగా సమ్మెలో ఉన్న ప్రభుత్వం స్పందించకపోవడం విచారకర మన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జిపి జేఏసీని చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రైతు వేదికలో రైతులతో నేడు సమావేశం

నవతెలంగాణ-నంగునూరు

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు ఈ నెల 18న నంగునూరు మండలం పాలమాకుల గ్రామ రైతు వేదికలో ఉదయం 11 గంటలకు రైతుల సమావేశం జరుగుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్ తెలిపారు. రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్ పట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్లాడిన విధానాలకు, నిరంకుశ వైఖరికి నిరసనగా పాలమాకుల గ్రామ రైతు వేదికలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాలమాకుల, రాజగోపాల్‌పేట, ముండ్రాయి, బద్దిపడగ, దర్గపల్లి, జేపీ తండా గ్రామాల రైతులు హాజరు కావాలని కోరారు. నంగునూరు మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు,ఎంపీటీసీలు, మండల నాయకులు,విద్యార్థి విభాగం నాయకులు, యువజన విభాగం నాయకులు, మహిళా విభాగం నాయకులు,రైతుబంధు సమితి మండలంలోని గ్రామ శాఖ అధ్యక్షులు, సభ్యులు,పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రతి ఒక్కరు పాలమాకుల రైతువేదిక వద్దకు రైతులను తీసుకవచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అనారోగ్యంతో బాధపడుతూ యువకుడి మృతి



నవతెలంగాణ-మర్కుక్

అనారోగ్యంతో బాధపడుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చేబర్తిలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మర్కుక్ మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన మందాల బాలస్వామి(28) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ గుర్రాల స్వామి, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములు గౌడ్, రైతు బంధు సమితి అధ్యక్షులు జాలని బాల్ నర్సయ్యలు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు మద్దతు



నవ తెలంగాణ -గజ్వేల్

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో ఓపియస్ సాధన రాష్ట్ర రథయాత్రలో భాగంగా నిర్వహించిన సమావేశంలో సోమవారం పాల్గొని మద్దతు తెలిపినట్లు పీఆర్టీయూ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాస్ రావు , సత్యనారాయణ రెడ్డి,మండల నాయకులు గురుజీ నాగరాజు సిపియస్ రాష్ట్ర నాయకులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

బాలసాహిత్యం ఎంతో అవసరం



నవ తెలంగాణ - సిద్దిపేట

బాలల వికాసానికి బాలసాహిత్యం ఎంతో అవసరమని ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ వాసర వేణి పరశు రాములు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, వారి ఉన్నతికి బాలసాహిత్యం ఎంతో అవసరమని, బాలసాహిత్యంపై పరిశోధనలు జరుగాలని అన్నారు. బాలసాహిత్య పుస్తకాల ప్రచురణతో పాటు బాలలకు చేరాలన్నారు. సిద్దిపేట బాల సాహిత్యంలో పేరు పొందిన ప్రాంతమని, బాల కవులు మరింతగా నైతిక విలువలతో కూడిన రచనలతో రాణించాలని అన్నారు. కార్యక్ర మంలో బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం, బస్వ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలను గ్రామాలలో తిరగకుండా నిలదీయాలి



కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక విషప్రచారం చేస్తున్న బీఆర్ఎస్
కాంగ్రెస్ నాయకులు సర్దార్‌ఖాన్

నవ తెలంగాణ- గజ్వేల్

కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ విషప్రచారం చేస్తోందని, బీఆర్ఎస్ నేతలను గ్రామాలలో తిరగకుండా నిలదీయాలని కాంగ్రెస్ నాయకులు సర్దార్‌ఖాన్ అన్నారు. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ గ్లోబల్ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో రైతులకు వ్యవసాయానికి చేసిన అభివృద్ధిని తెలంగాణ రైతాంగం మర్చిపోతున్నారు. కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన ప్రతి హామీని గతంలో అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, ఉచిత విద్యుతే కాదు రైతు రుణమాఫీ ఏకకాలంలో చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. రాజకీయాలకు బీఆర్ఎస్ రైతులను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. గతంలో వాళ్లు ఇచ్చిన హామీలను అమలు చేయని వాళ్లు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు పలుకుతున్నట్లు ఉందన్నారు. రైతు రుణమాఫీ చెయ్యని ఈ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడాలని, దళిత సమాజానికి మూడు ఎకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేసిన ఈ ప్రభుత్వాన్ని ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. వ్యవసాయానికి పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వని ఈ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై రైతు వ్యతిరేక చట్టాలకు మద్దతు ఇచ్చిందన్నారు. ప్రభుత్వాన్ని బొంద పెట్టాలన్నారు. కలెక్టర్లతో ఉన్నత అధికారులతో రైతులు వడ్లు నాటోదని బెదిరించింది అన్నారు. ఈ ప్రభుత్వాన్ని పాతళలోకానికి తరిమి వెయ్యాలన్నారు. ఈ బిఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలో వస్తే బోరు బావులకు మీటర్లు పెడతయానే విషయాన్ని గమనించాలన్నారు. రైతు వ్యతిరేకి రైతు దోహుళ ఈ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో విసిరేసి రైతును రాజు చేసిన వ్యవసాయాన్ని పండుగ చేసిన కాంగ్రెస్ పార్టీ కి దక్కిందన్నారు. ప్రజలు ఎల్లవేళలా మద్దతు ఇచ్చి కాంగ్రెస్ పై గ్లోబల్ విష ప్రచారం చేస్తున్న ఈ ప్రభుత్వానికి చెంప దెబ్బ లాంటి సమాధానం ఇవ్వాలన్నారు.

ప్రతి దేవాలయంలో ధూప దీప నైవేద్యానికి కృషి



నవ తెలంగాణ- గజ్వేల్

ప్రతి దేవాలయంలో ధూప దీప నైవేద్య జరిగే విధంగా ప్రయత్నం చేస్తామని సిద్దిపేట జిల్లా దూపదీప నైవేద్య అర్చక అధ్యక్షులు చాడా నంద బాల శర్మ అన్నారు. సోమవారం ధూప దీప నైవేద్య అర్చక సంఘానికి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లాలో అన్ని దేవాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించేలా తమంతు కృషి చేస్తామని తోటి పంతులతో ముందుకు వెళుతూ వారి సలహాలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్‌లో సోమవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చాడ నంద బాల శర్మకు శాలువాతో సత్కరించి ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ చాడ నందబాల శర్మ సిద్దిపేట జిల్లా ధూప దీప నైవేద్య అర్చక అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వారికి చిరు సన్మానం చేసి అభినందనలు తెలిపారు. నందబాల శర్మ ప్రజలను భక్తి మార్గం వైపు మల్లె విధంగా కృషి చేస్తూ దేవాలయాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న నంద బాల శర్మకు ముక్కోటి దేవతల అనుగ్రహం ఉండాలని ఇలాంటి పదవులు మరెన్నో పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాచారం దేవస్థానం డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, కొండపోచమ్మ దేవస్థానం డైరెక్టర్ గోలి సంతోష్, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు సిద్ధి బిక్షపతి, అత్తెల్లి లక్ష్మయ్య, భద్రయ్య, తోట బిక్షపతి,అయిత సత్యనారాయణ, ఇల్లెందుల శ్రీనివాస్, దొంతుల సత్యనారాయణ, శివ కుమార్, రుక్మయ్య చకిలం కృష్ణమూర్తి, సిద్దేశ్వర్, కైలాస ప్రశాంత్, సిరిపురం సత్యనారాయణ, గంప సాయికుమార్, సంతోష్, మహేష్ పాల్గొన్నారు.

రైతు తీర్మానంలో పాల్గొన్న ఎమ్మెల్యే రసమయి



నవతెలంగాణ-బెజ్జంకి : వ్యవసాయ రంగానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 24 విద్యుత్ సరఫరాపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో చేపట్టిన రైతు తీర్మానంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొని తీర్మానం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే ఎన్నికల్లో రైతుల ఆశీర్వాదంతో మూడవసారి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని ఎమ్మెల్యే దీమా వ్యక్తం చేశారు. ఎంపీపీ నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, బీఆర్ఎస్ అనుబంధ కమిటీల నాయకులు, అయా గ్రామాల రైతులు హజరయ్యారు.

కార్మికుల సమ్మెపై ప్రభుత్వ తీరు సిగ్గుచేటు



బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం
కార్మికుల బిక్షాటనకు విరాళం అందజేత

నవతెలంగాణ-బెజ్జంకి

గత పన్నెండు రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మెపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు ప్రభుత్వ తీరుకు నిరసన చేపట్టిన బిక్షాటన కార్యక్రమానికి నిషాని రామచంద్రం విరాళం అందజేశారు. పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న సిబ్బంది అధికంగా బడుగుబలహీన వర్గాలకు చెందిన ప్రజలేనని, బహుజన రాజ్యాధికారంలో బీఎస్పీ పార్టీ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించి సముచిత స్థానం కల్పిస్తుందని రామచంద్రం సూచించారు. రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీని గద్దెదించాలని కార్మికులకు సూచించారు. బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.